తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

23-05-2026

శనివారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 108

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక

www.siridaily.com

సిరి People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

epaper.siridaily.com

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575


## ఎండల గుప్పిట్లో

**సూర్య ప్రతాపంతో అల్లాడుతున్న జనం..**


# పవర్ పాలిటిక్స్!

- ఢిల్లీలో పదవుల కోసం నేతల పైరవీలు
- మంత్రివర్గంలో చోటు కోసం ముమ్మర లాబీయింగ్
- పదవులు ఊడుతాయనే భయంతో మంత్రుల్లో గుబులు
- ప్రతిపక్షాల విమర్శల హోరుతో హీటెక్కిన రాష్ట్ర రాజకీయం
- ప్రజా సమస్యలపై పాలకుల దృష్టి ఎప్పుడు సారించేను?

**(ప్రత్యేక ప్రతినిధి, సిరిన్యూస్):**

రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా అటు వాతావరణం, ఇటు రాజకీయం ఒకేసారి రికార్డు స్థాయి వేడిని నమోదు చేస్తున్నాయి. భానుడి భగభగలకు తోడు మౌలిక వసతుల కొరత సామాన్యుడిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, అధికార వర్గాలు మాత్రం రాజకీయ సమీకరణాలు, పదవుల పంపకాల్లో తలమునకలవ్వడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ తీవ్రత ముంచుకొస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యుత్ వినియోగం చరిత్రలోనే మునుపెన్నడూ లేని

మిగతా 3వ పేజీలో..






## భానుడి భగభగకు పెరిగిన విద్యుత్ వినియోగం!

- హైదరాబాద్‌లో రికార్డు స్థాయి డిమాండ్
- 21న 4766 మెగావాట్లకు చేరిన గరిష్ట వినియోగం
- ఇప్పటివరకు నమోదైన అత్యధిక డిమాండ్ ఇదే
- 100 మిలియన్ యూనిట్లకు పైగానే విద్యుత్ వాడకం
- గత ఏడాది కన్న వెయ్యి మెగావాట్లు అధికం
- 20శాతానికి పైగా పెరిగిన విద్యుత్ వినియోగం

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్ :**

సూర్యుని ప్రతాపానికి జనం విలవిలలాడుతుంటే ఉక్కపోత ఉపశమనానికి విద్యుత్ కు విపరీతమైన డిమాండ్ పెరిగింది.ఈ నెల 21న విద్యుడ్ డిమాండ్ 4,766 మెగావాట్లకు చేరుకుని రికార్డు నమోదు చేసింది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలో నాలుగు వేల మెగావాట్లకు తగ్గకుండా డిమాండ్ నమోదు అవుతుంది. గురువారం మధ్యాహ్నం విద్యుత్ డిమాండ్ 4,766 మోగావాట్లకు చేరుకోవడంతో ఇప్పటి వరకు గ్రేటర్ పరిధిలో ఇదే అత్యధిక రికార్డు డిమాండ్‌గా నమోదు కావడం గమనార్హం. ఈ ఏడాది

మిగతా 3వ పేజీలో..



## రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు: కవిత

- సచివాలయం వద్ద టీఆర్ఎస్ భారీ ఆందోళన
- రోడ్డుపై ధాన్యం పోసి వినూత్న నిరసన
- వరికి రూ.500 బోనస్ ఇవ్వాలంటూ డిమాండ్
- కొనుగోళ్లలో జాప్యంపై ప్రభుత్వంపై మండిపాటు
- ఉద్రిక్తత మధ్య కవిత, కార్యకర్తల అరెస్ట్

2

## నిందితుడిని దాచి ఉంచిన నేరం రేవంత్‌దే

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

**రైతుల కష్టాలు కనిపించడం లేదా..?**

- ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వానికి కేటీఆర్ సవాల్

2




## 2,000 కిడ్నీ మార్పిడులతో అరుదైన రికార్డు

- 'నిమ్స్' వైద్య బృందానికి సీఎం అభినందనలు

**హైదరాబాద్, మే 22 సిరి న్యూస్:**

హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌లో దేశంలోనే అరుదైన రికార్డు నమోదు చేసింది. 'నిమ్స్' యూరాలజీ విభాగం ఇప్పటివరకు 2,000 కిడ్నీ మార్పిడులు పూర్తి చేసి దక్షిణ భారత దేశంలో నెంబర్ వన్‌గా నిలిచింది. దేశంలో కిడ్నీ

మిగతా 2వ పేజీలో..



## ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ వ్యాపారం



3

- బీఆర్ఎస్ రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు
- మాజీ మంత్రి హరీష్ రావు హెచ్చరిక

**సీఎం రేవంత్ కు విజన్ లేదు** 3



2

## సంత్ సేవాలాల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌కు వినతి

- లంబాడ ప్రజాప్రతినిధుల బృందం ముఖ్యమంత్రితో భేటీ
- ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్



## సంక్షేమం, మూసీ పునరుజ్జీవం ప్రథమ ప్రాధాన్యతలు

- 3 ట్రిలియన్ల ఆర్థిక వ్వవస్థే లక్ష్యం
- తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతం
- పట్టణీకరణతో సేవల రంగానికి భారీ అవకాశాలు
- విద్యార్థుల రుణాలు భవిష్యత్తు పెట్టుబడులు
- వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు
- బ్యాంకర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మే 22 సిరి న్యూస్:**

సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతలను ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ 2047

మిగతా 3వ పేజీలో..




## గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

- వ్యవసాయాధార పరిశ్రమలకు రుణాలు పెంచాలి
- సంప్రదాయ వ్యవసాయ రుణాలకే పరిమితం కారాదు
- బ్యాంకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల సూచన

**హైదరాబాద్, మే 22 సిరి న్యూస్:**

రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో బ్యాంకులు చురుకైన భాగస్వాములు కావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజా భవన్‌లో శుక్రవారం

మిగతా 2వ పేజీలో..




## శంషాబాద్‌లో హైడ్రా మెరుపు దాడులు

- ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- ఎయిర్‌పోర్ట్ సమీపంలో అక్రమ కట్టడాల కూల్చివేత
- బుల్డోజర్లతో నిర్మాణాలు నేలమట్టం చేసిన హైడ్రా
- భారీ పోలీస్ బందోబస్తు మధ్య కొనసాగిన చర్యలు

3

## భానుడి భగభగ!

- తెలుగు రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు
- పిడుగురాళ్లలో 48.1 డిగ్రీల రికార్డు
- తెలంగాణలో పెద్దపల్లి, మునగాలలో 46.5 డిగ్రీలు
- ఏపీ, తెలంగాణలో రెడ్ అలర్ట్ కొనసాగింపు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



2

## నిందితుడిని దాచి ఉంచిన

# నేరం రేవంత్‌దే

**హైదరాబాద్, మే 22 సిరి న్యూస్ :**

తనకు అన్యాయం జరిగిందని ఓ ఆడబిడ్డ బయటకు వస్తే ఆ కుటుంబాన్ని బెదిరించి కౌంటర్ కేసు పెట్టించి నిందితుడిని తొమ్మిది రోజులు కాపాడింది ముమ్మాటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తనకు అన్యాయం జరిగిందని మైనర్ బాలిక తల్లిదండ్రులతో పోలీస్ స్టేషన్‌కు వెళ్తే అర్ధరాత్రి వరకు నిలబెట్టి తీవ్ర ఆవేదనకు గురిచేసింది రాష్ట్ర ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. నిందితుడికి బెయిల్ ఇవ్వనని హైకోర్టు తెగేసి చెప్పడం, రాష్ట్రంలోని ప్రతీ ఆడబిడ్డ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోయడం తోనే దిక్కులేని పరిస్థితుల్లో నిందితుడిని అరెస్టు చేశారన్నారు. రాష్ట్ర హోం శాఖకు బాధ్యుడిగా ఉన్న ముఖ్యమంత్రి.. ప్రధాన మంత్రి పర్యటన వల్ల పోలీసులంతా బిజీ ఉన్నారని అడ్డగోలు సాకులు చెప్పేందుకు సిగ్గుపడాలన్నారు. అత్యంత సున్నితమైన ఈ విషయంలో పార్టీ తరపున మౌనంగా ఉన్నామని, ఏనాడూ రాజకీయం చేయలేదని కేటీఆర్ తెలిపారు. కానీ ముఖ్యమంత్రి తమపై విమర్శలు చేసిన తర్వాతనే తప్పని పరిస్థితుల్లో మాట్లాడాల్సి వస్తున్నదన్నారు. ముఖ్యమంత్రి పోక్సో కేసు నిందితుడిని తొమ్మిది రోజులు దాచిపెట్టిన సందర్భం ఎక్కడైనా ఉన్నదా అన్న విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు, రేవంత్ రెడ్డికి ఉన్న అనుబంధం వల్లనే ఇద్దరూ కలిసి నిందితుడిని తొమ్మిది రోజులు దాచి ఉంచారని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి సన్నిహితుడి హాస్పిటల్‌లో తొమ్మిది రోజుల పాటు దాచిపెట్టారన్న వార్తలు వస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం విచారణ చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ కొడుకుతో తనకు సంబంధం లేదని కోర్టు ద్వారా ఆర్డర్ తెచ్చుకున్నాడని, అంతటి దుర్మార్గమైన పరిస్థితి ఏ తండ్రికీ రావద్దని కేటీఆర్ అన్నారు. ఒకవైపు తన కొడుకుతో సంబంధం లేదని చెప్తూనే తిరిగి తానే పోలీసులకు అప్పజెప్పానని అనడం ఏంటో సమాధానం చెప్పాలన్నారు. పోక్సో కేస్ నిందితులు తొమ్మిది రోజులు తప్పించుకోలేరని, కేంద్ర మంత్రి కొడుకు కావడం, ముఖ్యమంత్రి అండదండలు ఉండడం వల్లనే తప్పించుకున్నాడని కేటీఆర్ అన్నారు. ఈ అంశంలో పార్టీ జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అద్భుతంగా ప్రభుత్వాన్ని, మీడియాను అలర్ట్ చేశారని అభినందించారు. అలాంటి ప్రవీణ్ కుమార్ గురించి అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్ రెడ్డి మాటల్ని కేటీఆర్ ఖండించారు. రేవంత్ రెడ్డి లాంటి దొంగ.. దొంగలను ఎలా పట్టుకోవాలో పోలీసులకు చెప్పినట్లు వచ్చిన వార్తలపై ఎద్దేవా చేశారు. ఈ కేసు విషయంలో హనీ ట్రాప్ అంటూ అడ్డగోలు వార్తలు రాసిన మీడియా, రాయించిన వ్యక్తులు ఎవరో సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి, బండి సంజయ్‌లు మీడియా కార్యాలయాలకు ఫోన్ చేసి కాళ్లావేళ్లా పడి వార్తలు రాకుండా ఆపింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ ఆడబిడ్డలకు అన్యాయం జరిగినా కొట్లాడింది తామే అని, అది లగచర్ల మొదలుకొని అనేక అంశాల్లో తమ పార్టీ తరపున కొట్లాడుతున్నామని చెప్పారు. బండి సంజయ్‌తో తనకు ఎలాంటి పంచాయితీ లేదని, ఆయన తన తండ్రి గురించి ఇష్టారీతి మాట్లాడినా ఏ రోజూ తాను స్పందించలేదని కేటీఆర్ తెలిపారు. ఈ రోజు కూడా బండి సంజయ్‌ను ఏమనడం లేదని, కేవలం నేరస్థుడు ఎవడైనా నేరస్థుడే అనే ఆలోచనతోనే మాట్లాడుతున్నామని అన్నారు. పోక్సో కేసు విషయంలో జరుగుతున్న అన్యాయంపైన ప్రశ్నిస్తే మా బావమరిది ఇంటిపైన డ్రగ్స్ దాడి జరిగింది అంటూ మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి కేసు ఎందుకు పెట్టడం లేదు అని, దమ్ముంటే కేసు పెట్టి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు

# రైతుల కష్టాలు కనిపించడం లేదా..?

**హైదరాబాద్, మే 22 సిరి న్యూస్:**

"ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగుతున్నాయని నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధం" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. రైతుల సమస్యలు, ధాన్యం కొనుగోళ్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకురావాలని తాను లేఖ రాశానని తెలిపారు. సీఎంకు డబ్బు సంచులపై ఉన్న దృష్టి ధాన్యం సంచులపై కూడా ఉంటుందని భావించాని, కానీ ఇటీవల సీఎం నిర్వహించిన ప్రెస్‌మీట్‌తో పరిస్థితి అర్థమైందని వ్యాఖ్యానించారు. పౌర సరఫరాల శాఖ మంత్రి వాస్తవాలకు విరుద్ధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 45 డిగ్రీల ఎండల్లో రైతులు 45 రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఒకే రోజు నలుగురు రైతులు మరణించిన ఘటనలపై తమ పార్టీ నేతలు స్పందించారని తెలిపారు. రాష్ట్రంలో గన్నీ బ్యాగులు దొరకడం లేదని, కానీ గన్స్ మాత్రం దొరుకుతున్నాయని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడా కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు.

"స్థలం మీరు నిర్ణయించండి.. మేము వస్తాం. కొనుగోళ్లు సరిగా జరుగుతున్నాయని నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధం" అంటూ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లు 45 శాతం కూడా దాటలేదని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో మృతి చెందిన రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించేలా కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ అంశాలపై స్పందిస్తూ బీజేపీ-కాంగ్రెస్ కలిసి తెలంగాణలో ప్రభుత్వాన్ని నడుపుతున్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన వల్ల రైతులకు ఎలాంటి లాభం జరగలేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ అధికారి

- **రూ.25 వేల లంచం స్వీకరిస్తుండగా పట్టివేత**
- **మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఏసీబీ దాడి**

**మెదక్, మే 22 సిరి న్యూస్:**

మెదక్ జిల్లా నర్సాపూర్ విద్యుత్ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కాడు. నర్సాపూర్ ఆపరేషన్స్ విభాగానికి చెందిన ఏడీఈ ముద్దం రమణారెడ్డి అధికారిక పనికి సంబంధించి రూ.25 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ విడుదల చేసిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారునికి సంబంధించిన 11 వర్క్ బిల్లులను మెదక్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయానికి ఫార్వర్డ్ చేయడానికి ముద్దం రమణారెడ్డి లంచం కోరినట్లు తెలిసింది. మొత్తం రూ.3,13,882 విలువైన బిల్లులను ముందుకు పంపేందుకు రూ.25 వేల రూపాయలు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు ప్రత్యేకంగా ఉచ్చుపన్ని శుక్రవారం మధ్యాహ్నం నర్సాపూర్ కార్యాలయంలో దాడి నిర్వహించారు. లంచం మొత్తాన్ని స్వీకరిస్తున్న సమయంలోనే అధికారిని అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి రూ.25 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజా విధులను నిజాయితీగా నిర్వహించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, అక్రమ లాభం కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఫిర్యాదుదారుని వివరాలను భద్రతా కారణాల రీత్యా గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ తెలిపింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరింది. వాట్సాప్, సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించింది.

# భానుడి భగభగ!

- **తెలుగు రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు**
- **పిడుగురాళ్లలో 48.1 డిగ్రీల రికార్డు**
- **తెలంగాణలో పెద్దపల్లి, మునగాలలో 46.5 డిగ్రీలు**
- **ఏపీ, తెలంగాణలో రెడ్ అలర్ట్ కొనసాగింపు**
- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక**

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్ :**

తెలుగు రాష్ట్రాలు నిప్పుల కుంపటిలా మారుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 8 గంటలకే సూర్యుడు సుర్రుమంటుండటంతో అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావడం లేదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేయగా, మిగిలిన జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1 డిగ్రీలు నమోదయ్యాయి. తెలంగాణలో పెద్దపల్లి జిల్లా ముత్తారం, సూర్యాపేట జిల్లా మునగాలలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

**200 మండలాల్లో 44 డిగ్రీలకు మించి..**

ఆంధ్రప్రదేశ్‌లో బాపట్ల జిల్లా వేటపాలెం, కృష్ణా జిల్లా నందివాడలో 47.6 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీలు నమోదయ్యాయి. ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 46.6 డిగ్రీలు, పోలవరం జిల్లా కూనవరంలో 46.5 డిగ్రీలు, నెల్లూరు జిల్లా కావలిలో 46.4 డిగ్రీలు, గుంటూరు జిల్లా తెనాలిలో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా, 20 జిల్లాల్లోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఈ భీకర ఎండల తీవ్రత సోమవారం వరకు కొనసాగనున్నట్లు అధికారులు హెచ్చరిస్తున్నారు.

**తెలంగాణలో పరిస్థితి తీవ్రం**

తెలంగాణలోనూ ఎండలు దంచికొడుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో 46.4 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లా కురవిలో 46.3 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 46.2 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్‌లో 46.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటడంతో పరిస్థితి తీవ్రంగా మారింది. భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పగటి వేళల్లో బయటకు రావొద్దని వాతావరణ శాఖ సూచిస్తోంది.



# 2,000 కిడ్నీ మార్పిడులతో అరుదైన రికార్డు

**మొదటిపేజీ తరువాయి**

ట్రాన్స్ ప్లాంట్‌లో గుజరాత్‌లోని ఐకేడీఆర్సీ నెంబర్ వన్ స్థానంలో ఉంది. సెకండ్ ప్లేస్‌లో లూథియానా క్రిస్టియన్ కాలేజీ ఉండగా 'నిమ్స్' మూడో స్థానంలో ఉంది. ఈ అరుదైన మైలురాయిని సాధించి కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందించిన 'నిమ్స్' వైద్య బృందానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ 2,000 మందిలో 1,900 మంది అంటే 95% మంది రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా కిడ్నీ మార్పిడి చేయించుకున్నవారు కావడం విశేషం. 2023 జనవరి నుంచి గడిచిన మూడేళ్ల నాలుగు నెలల్లోనే 500 కిడ్నీ మార్పిడులు చేసి ఈ హాస్పిటల్ రికార్డు నెలకొల్పింది.

**వైద్యులకు మంత్రి దామోదర్ అభినందన**

నిమ్స్ వైద్య బృందం సాధించిన ఈ ఘనత పట్ల ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందనలు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనూ అత్యాధునిక వైద్యం అందించగల సామర్థ్యం తెలంగాణకు ఉందని నిమ్స్ నిరూపిస్తోందన్నారు. ఇటీవల గాంధీ హాస్పిటల్‌లో ఆరు మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతోపాటు అత్యాధునిక వసతులతో కూడిన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. సనత్‌నగర్‌లోని టిమ్స్‌లో కూడా ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఎక్సలెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్లను సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి వెల్లడించారు. దీంతో ప్రభుత్వ రంగంలోనే అత్యాధునిక అవయవ మార్పిడి సేవలు మరింత విస్తృతంగా అందుబాటులోకి వస్తాయన్నారు.

**యూరాలజీ, నెఫ్రాలజీ విభాగంతోనే సాధ్యమైంది : డైరెక్టర్ బీరప్ప**

దేశంలో రెండు వేల కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేసిన ప్రభుత్వ హాస్పిటల్‌గా 'నిమ్స్' రికార్డు సృష్టించిందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప శుక్రవారం ప్రకటించారు. నిమ్స్ యూరాలజీ, నెఫ్రాలజీ విభాగం డాక్టర్లు, సిబ్బంది అద్భుతమైన పనితీరుతోనే ఈ అచీవ్‌మెంట్‌ను సాధించగలిగామన్నారు. అవయవ మార్పిడి అనంతరం జీవితాంతం అవసరమయ్యే మందులను కూడా ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిమ్స్ యూరాలజీ విభాగం హెడ్, డాక్టర్ రాహుల్ రాజ్‌ను బీరప్ప అభినందించారు. యూరాలజీ విభాగం ఆధ్వర్యంలోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు. క్లిష్టమైన బహుళ రక్తనాళాల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు, చిన్నారుల్లో ట్రాన్స్‌ప్లాంట్లు, రీట్రాన్స్‌ప్లాంట్లు వంటి సవాలుతో కూడిన ఆపరేషన్లను యూరాలజీ టీమ్ విజయవంతంగా నిర్వహించిందన్నారు. దక్షిణ భారత దేశంలో ప్రభుత్వ హాస్పిటల్‌లో తొలి రోబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ కూడా నిమ్స్‌లోనే నిర్వహించడం విశేషమన్నారు.

# రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు: కవిత

**హైదరాబాద్, సిరి న్యూస్:**



"రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదు" అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని నిరసిస్తూ హైదరాబాద్ సచివాలయం ప్రధాన ద్వారం వద్ద ఆమె భారీ ఆందోళన చేపట్టారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సచివాలయాన్ని ముట్టడించిన కవిత.. రాష్ట్రవ్యాప్తంగా ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు తీవ్రంగా ఆలస్యమవుతున్నాయని మండిపడ్డారు. రైతులు పండించిన పంటను వెంటనే కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

తేమ శాతం, తరుగు పేరుతో "కటింగ్స్" విధిస్తూ మిల్లర్లు, అధికారులు రైతులను నష్టపరుస్తున్నారని విమర్శించారు. వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించాలని, ఎలాంటి నిబంధనలు లేకుండా వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

జొన్నలు, పొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటలకు కూడా MSP కల్పించాలని కోరారు. నిరసనలో భాగంగా సచివాలయం ప్రధాన ద్వారం ఎదుట రోడ్డుపై వరి ధాన్యాన్ని పోసి వినూత్నంగా ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సచివాలయం వైపు వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయి భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించడంతో తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కవితతో పాటు పార్టీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## సంత్ సేవాలాల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌కు వినతి

**హైదరాబాద్, మే 22 సిరి న్యూస్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను లంబాడ ప్రజాప్రతినిధుల బృందం శుక్రవారం జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి పలు కీలక అంశాలపై వినతిపత్రం అందజేసింది. లంబాడీల ఆధ్యాత్మిక గురువు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ పేరుతో ప్రత్యేకంగా "సంత్ సేవాలాల్ కార్పొరేషన్" ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరారు. లంబాడ సమాజ అభివృద్ధి, ఆర్థిక సాధికారత కోసం ఈ కార్పొరేషన్ కీలకంగా ఉపయోగపడుతుందని ప్రతినిధులు వివరించారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను విభజించి ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని కూడా బృందం విజ్ఞప్తి చేసింది. గిరిజనుల సమస్యలు, హక్కులు, సంక్షేమ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలంటే ప్రత్యేక కమిషన్ అవసరమని వారు పేర్కొన్నారు. ఎస్టీలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో వేగం పెరగడంతో పాటు పరిపాలనా స్థాయిలో మరింత ప్రాధాన్యం లభిస్తుందని వివరించారు. ఈ భేటీలో ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యేలు మురళీ నాయక్, రాందాస్ నాయక్ పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ కూడా ముఖ్యమంత్రిని కలిసి తమ అభిప్రాయాలు వెల్లడించారు. తెలంగాణ గిరిజన డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ట్రైకార్) చైర్మన్ బెల్లయ్య నాయక్ సహా పలువురు గిరిజన నాయకులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. లంబాడ సమాజానికి విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి రంగాల్లో మరింత ప్రోత్సాహం అవసరమని వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సంత్ సేవాలాల్ మహారాజ్ పేరు మీద కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే గిరిజన యువతకు ప్రత్యేక పథకాలు, స్వయం ఉపాధి అవకాశాలు, ఆర్థిక సాయం, శిక్షణ కార్యక్రమాలు అమలు చేయడానికి అవకాశం ఉంటుందని ప్రతినిధులు వివరించారు. సమాజ అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వారి వినతులను శ్రద్ధగా విన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. లంబాడ సమాజ అభివృద్ధికి సంబంధించిన అంశాలను పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

# రేపు యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రాక

**యాదగిరిగుట్ట, మే 22 సిరి న్యూస్:**

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ అభివృద్ధిలో భాగంగా సుమారు రూ.100 కోట్ల వ్యయం కాగల పనులకు శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం యాదగిరిగుట్ట విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. యాదగిరిగుట్ట టెంపుల్ సిటీ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భద్రతా చర్యలు, పారిశుధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. అలాగే ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించి అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు సంబంధించిన మార్గదర్శకాలను అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అయిలయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. యాదగిరిగుట్టకు ముఖ్యమంత్రి రాకతో టెంపుల్ సిటీ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ బ్యాంకర్లు కేవలం సాంప్రదాయ పంట రుణాలకే పరిమితం కాకుండా గ్రావి□ణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రుణాల పంపిణీని భారీగా పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గ్రావి□ణ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని, ఈ అవకాశాన్ని బ్యాంకులు ఉపయోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో క్రెడిట్ `డిపాజిట్ నిష్పత్తి రికార్డు స్థాయిలో 130.78 శాతం నమోదు కావడం విశేషమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బ్యాంక్ డిపాజిట్లు రూ.9.43 లక్షల కోట్లుగా ఉంటే అడ్వాన్సులు (రుణాలు) రూ.12.33 లక్షల కోట్లకు చేరాయని, వ్యవసాయ రంగానికి రుణాల పంపిణీలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించిందని తెలిపారు. నిర్ణీత లక్ష్యం కంటే ఎక్కువగా 102 శాతం ప్రగతిని నమోదు చేయడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో పంట రుణాల పంపిణీ రూ.75,486 కోట్లకు చేరిందని, వ్యవసాయ రంగానికి మొత్తంగా రూ.1.68 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు అందజేశాయని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణ మాఫీ కార్యక్రమం వల్ల గ్రావి□ణ ప్రాంతాల్లో రుణ సంస్కృతి పునరుద్ధరణ జరిగింది. ప్రభుత్వ నిర్ణయాల వల్ల బ్యాంకులలో వ్యవసాయ నిరర్ధక ఆస్తులు 5.23 శాతం నుంచి 4.71 శాతానికి తగ్గాయి. తెలంగాణలో ఉద్యానవన రంగంతోపాటు ఆయిల్ పామ్ సాగుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి అన్నారు. ఈ రంగాలకు బ్యాంకులు పెద్దపీట వేయాలని కోరారు. పంట నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, సైలోల నిర్మాణానికి బ్యాంకులు ఉదారంగా రుణాలు ఇవ్వాలన్నారు. అలాగే రాష్ట్రంలో ఉన్న దాదాపు వెయ్యి రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు తగిన ఆర్థిక మద్దతు అందించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని ఆధునికీకరించేందుకు, యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.147.91 కోట్ల బ్జడెట్‌ను కేటాయించింది. కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పంట రుణాలు అందేలా బ్యాంకులు బాధ్యత తీసుకోవాలన్నారు. వీటితోపాటు పర్యావరణహితమైన సోలార్ వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్ పద్ధతులకు రుణ సదుపాయాన్ని గణనీయంగా పెంచాలని మంత్రి తుమ్మల సూచించారు.

## ఫ్యూచర్ సిటీ పేరుతో
# రియల్ వ్యాపారం

హైదరాబాద్, మే 22 సిరి న్యూస్:

ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని బీఆర్ఎస్ నేత టి.హరీష్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీకి మాత్రమే కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి ఇచ్చిందని, డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో ఉందని వెల్లడించారు. ఫార్మా సిటీని కొనసాగిస్తామని ఓ వైపు కోర్టుకు చెబుతూ రేవంత్ ప్రభుత్వం జిమ్మిక్కు చేస్తోందని విమర్శించారు. ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధంగా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. 75శాతం ఫార్మా సిటీ ఉండి 25శాతం మిగతావి ఉండాలన్నారు. కానీ 75 శాతం మిగతా వ్యాపారం చేసి కేవలం 25 శాతమే ఫార్మా వచ్చేలా చేస్తున్నారని ఆరోపించారు. ఇది చట్ట ప్రకారం చెల్లదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఫార్మా సిటీని రిస్టోర్ చేస్తామని స్పష్టం చేశారు. 'ఇది నా మాట కాదు.. పార్లమెంట్ చట్టం. ఫార్మా సిటీ వస్తే లక్ష□ మందికి ఉద్యోగాలు వస్తాయని తాము ప్రారంభించాం. మన దగ్గర నుంచి ఒక్క ఫార్మా కంపెనీ బయటకు వెళ్లొద్దని చేశాం. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోయింది. ఆఖరు సంవత్సరం ఎన్నికల హడావుడి. రేవంత్ సర్కార్ ఏవి□ చేయలేదు. భూములు పంచి పెడితే బ్యాక్ ఎండ్ ఏదో లబ్ది పొందాలని ప్లాన్ చేశారు అని ఆరోపించారు. ఫార్మా సిటీ అభివృద్ధి చెందితే బీఆర్ఎస్‌కు పేరు వస్తుందని ఇలా చేశారన్నారు. ఉన్నది ఉన్నట్టు అక్కడ ఫార్మా సిటీనే వస్తుంది అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్ కు విజన్ లేదు

- **ప్లాట్లు కొనాలంటే ఎన్నారైలే భయపడుతున్నారు**
- **పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ ప్రగతి పథం**
- **అమెరికాలో మాజీ మంత్రి హరీష్ రావు 'మీట్ అండ్ గ్రీట్'**

న్యూజెర్సీ, మే 21 :

అమెరికా పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కీలక నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుకు న్యూజెర్సీలోని హల్దీ మౌంట్ లారెల్‌లో ప్రవాస భారతీయులు, బీఆర్ఎస్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అక్కడ ఏర్పాటు చేసిన 'మీట్ అండ్ గ్రీట్ విత్ హరీష్ రావు' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. బీఆర్ఎస్ నాయకుడు కర్నాటి విద్యాసాగర్‌తో పాటు ఎన్నారై ప్రతినిధులు మహేష్ తన్నీరు, నరసింహా రావు, భాస్కర్ పిన్న, రవీందర్ రావు తదితరులు హరీష్ రావుకు శాలువాలు, పూలమాలలతో సాదర స్వాగతం పలికారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ సమకాలీన రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలపై ఎన్నారైలతో హరీష్ రావు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని గుర్తు చేశారు. "నాడు వ్యవసాయ రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత వల్లే, ఒకప్పుడు కరువుతో అల్లాడిన తెలంగాణ.. పదేళ్లలో దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండించే పంజాబ్ రాష్ట్రాన్ని సైతం మించిపోయి రికార్డులు సృష్టించింది. సంక్షేమం, ఐటీ, మౌలిక వసతులు.. ఇలా ప్రతి రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్లే తెలంగాణ మోడల్ దేశానికే దిక్సూచిగా మారిందన్నారు.

**విజన్ లేని రేవంత్ పాలనతో ప్రజల ఇబ్బందులు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎలాంటి విజన్ లేదని, ఆయన పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు తెలంగాణలో స్థిరాస్తి పెట్టుబడులకు ఎగబడిన ఎన్నారైలు.. నేడు ఇక్కడి పరిస్థితులు చూసి స్వరాష్ట్రంలో కనీసం ఒక్క ప్లాట్ కొనాలన్నా తీవ్రంగా భయపడుతున్నారని వ్యాఖ్యానించారు.

**కేంద్రంలో చక్రం తిప్పేది ప్రాంతీయ పార్టీలే**

దేశ రాజకీయాలపై స్పందిస్తూ దేశంలో ప్రాంతీయ పార్టీలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని హరీష్ రావు అభిప్రాయపడ్డారు. జాతీయ పార్టీల కంటే ప్రాంతీయ పార్టీల వల్లే ఆయా రాష్ట్రాలకు ఎక్కువ న్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రాంతీయ పార్టీలే కేంద్రంలో చక్రం తిప్పుతున్నాయని, రాబోయే రోజుల్లో వాటి ప్రాధాన్యత మరింత పెరుగుతుందని ఆయన తేల్చిచెప్పారు. ఈ గ్రాండ్ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఎన్నారై ప్రముఖులు అమర్ గుండ, పరమేశ్ బీం రెడ్డి, చైతన్న చిట్టిమల్ల, వరప్రసాద్, చందు తాళ్ల, పూర్ణ బైరి, నర్సింహా రెడ్డి, దొంతిరెడ్డి, రజినీతో పాటు పలువురు ఉత్తర అమెరికా బీఆర్ఎస్ ప్రతినిధులు, తెలంగాణ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భానుడి భగభగకు పెరిగిన విద్యుత్ వినియోగం!

మొదటిపేజీ తరువాయి

ఎండల తీవ్రత బాగా ఉన్నది. సూర్యప్రతాపంతో వేడిని తట్టుకోలేక చల్లదనం కోసం వినియోగదారులు ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వాడకం పెరిగింది. దీనితో విద్యుత్ డిమాండ్, వినియోగం కూడా పెరిగింది. వినియోగం కూడా అదే స్థాయిలో పెరుగుతుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యుత్ డిమాండ్ కొత్త రికార్డును సృష్టించింది. గురువారం (మే 21) రోజున గరిష్ట విద్యుత్ డిమాండ్ 4,766 మెగావాట్లకు చేరుకుంది. ఇప్పటివరకు నమోదైన గరిష్ట విద్యుత్ డిమాండ్ ఇదే. గత ఏడాది మే 6న అత్యధికంగా 4,352 మెగావాట్ల రికార్డును ఏప్రిల్ నెలలోనే నెలలోనే అధిగమించడం విశేషం. విద్యుత్ వినియోగం కూడా అదే స్థాయిలో పెరిగింది. గురువారం గ్రేటర్‌లో విద్యుత్ వినియోగం 100.83 మిలియన్ యూనిట్లుగా నమోదు అయింది. సాధారణంగా వేసవి తీవ్రత పెరిగే మే నెలలో విద్యుత్ వినియోగం గరిష్ట స్థాయికి చేరుతుంది. అయితే ఈసారి ఉష్ణోగ్రతలు ముందుగానే పెరగడం, వాణిజ్య, గృహ వినియోగం అధికం కావడం వల్ల ఏప్రిల్ నెల నుంచి నాలుగు వేల మేగావాట్లకు తగ్గకుండా విద్యుత్ డిమాండ్ నమోదు అవుతుంది. గురువారం రికార్డు స్థాయిలో 4,766 మెగావాట్లు నమోదు కావడం గమనార్హం. రికార్డు స్థాయిలో పెరుగుతున్న డిమాండ్ కు అనుగుణంగా నిరంతర సరఫరా అందించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో, 33 కేవీ/11 కేవీ ఫీడర్ల పై, సబ్ స్టేషన్ల లోని పవర్ ట్రాన్స్ ఫార్మర్ల లోడ్ ను పర్యవేక్షించాలని ఇప్పటికే క్షేత్ర స్థాయి అధికారులను, సి బ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ వెయ్యి మెగావాట్లకు ఎక్కువగా ఉండడం గమనార్హం. విద్యుత్ వినియోగం కూడా 20 మిలియన్ యూనిట్ల పెరిగింది. సరాసరిగా 20 శాతం విద్యుత్ డిమాండ్, వినియోగం పెరగడం గమనార్హం.



# సంక్షేమం, మూసీ పునరుజ్జీవం ప్రథమ ప్రాధాన్యతలు

మొదటిపేజీ తరువాయి




నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు చేరుకోవడం, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం అద్వితీయ విషయని చెప్పారు. వ్యవసాయ రుణాల విషయంలో రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయంగా చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక అని, రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు, అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు సహా వివిధ పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయమని అన్నారు. రాష్ట్రం పారిశ్రామిక రంగంలో అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటని డిప్యూటీ సీఎం చెప్పారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై మరింత దృష్టి పెట్టాలని కోరారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో మరింత సానుకూల దృక్పథంతో ముందుకు రావాలన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై మనం పెట్టే భవిష్యత్ పెట్టుబడి అని చెప్పారు. సంక్షేమంఅభివృద్ధి రెండూ జోడెడ్లుగా పరుగులు తీయగలవని ప్రజాప్రభుత్వం చేతల్లో నిరూపించిందన్నారు. సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి సృష్టికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. నేడు ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధన రంగంపై దృష్టి సారిస్తోందని, అందులో భాగంగా ప్రజా ప్రభుత్వం కూడా సౌరశక్తి విభాగంలో స్థిరమైన ప్రగతిని సాధిస్తోందని డిప్యూటీ సీఎం చెప్పారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని కోరారు. సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలన్నారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలుగానే కాక రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధిలో భాగస్వాములుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రభుత్వం 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుందని, ప్రస్తుత వృద్ధి రేటు చూస్తుంటే ఇది ఖచ్చితంగా సాధ్యమేనని భట్టి స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ సగటు వృద్ధి రేటు 8.2%గా ఉంటే తెలంగాణ వృద్ధి రేటు 10.7%తో దూసుకుపోతోందని చెప్పారు. దేశ సగటు తలసరి ఆదాయం రూ.2.1 లక్షలుగా ఉంటే తెలంగాణ తలసరి ఆదాయం రూ.4.18 లక్షలతో దేశంలోనే అగ్రగామిగా ఉందని ఉప ముఖ్యమంత్రి గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో వేగంగా పట్టణీకరణ జరుగుతోందని, ఈ నేపథ్యంలో సేవల రంగానికి అధిక అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు.

**వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు**

మహిళా ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాల వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఈ ఏడాది హైదరాబాద్ నగరంలో మహిళా సంఘాలకు రుణ పంపిణీపై యుద్ధప్రాతిపదికన దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వ్యాపార, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగాల్లో ఎదగడానికి మహిళలకు నగరం ఎన్నో అవకాశాలను ఇస్తోందని చెప్పారు. నగరంలోని మురికివాడల్లోని యువ మహిళా పారిశ్రామికవేత్తలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో త్వరలోనే అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లను తీసుకు వస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ వంటి వివిధ రంగాలను డిజైన్ చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఫైనాన్స్ ప్లానింగ్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ మోహన్, ఎస్బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో హైడ్రా మెరుపు దాడులు

హైదరాబాద్, మే 22 సిరి న్యూస్:

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు, భూ ఆక్రమణలపై హైడ్రా అధికారులు దూకుడు కొనసాగిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై శుక్రవారం మెరుపు దాడులు నిర్వహించారు. ఎయిర్‌పోర్ట్ కాలనీ పరిసరాల్లో ఔటర్ రింగ్ రోడ్డు పక్కన ఉన్న సుమారు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను బుల్డోజర్లతో కూల్చివేశారు. ఈ భూమిని కొంతమంది ఆక్రమణదారులు ఎలాంటి అనుమతులు లేకుండా స్వాధీనం చేసుకుని పక్కా నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు.

సమాచారం అందుకున్న హైడ్రా బృందాలు భారీ యంత్రాలతో అక్కడికి చేరుకుని కూల్చివేతలు చేపట్టాయి. ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందస్తుగా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల పహారా మధ్య అక్రమ నిర్మాణాలను పూర్తిగా నేలమట్టం చేసి ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

హైదరాబాద్ నగరం, శివారు ప్రాంతాల్లో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి రక్షించడమే లక్ష్యంగా హైడ్రా నిరంతరం దాడులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎంతటి రాజకీయ పలుకుబడి ఉన్నవారైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మరోసారి స్పష్టం చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో జరిగిన ఈ కూల్చివేతలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

# భద్రాద్రిలో 385 కేజీల గంజాయి పట్టివేత

- **వాహన తనిఖీల్లో భారీగా గంజాయి స్వాధీనం**
- **రెండు కార్లు, ఒక లారీ సీజ్ చేసిన పోలీసులు**
- **ఆరుగురు నిందితుల అరెస్ట్**

భద్రాద్రి కొత్తగూడెం, మే 22 సిరి న్యూస్

గంజాయి అక్రమ రవాణాపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లాలో నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 385 కిలోల గంజాయిని పట్టుకుని అక్రమ రవాణాకు ఉపయోగించిన రెండు కార్లు, ఒక లారీని పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. అనుమానాస్పద వాహనాలను ఆపి తనిఖీ చేయగా భారీగా గంజాయి బయటపడినట్లు పేర్కొన్నారు. గంజాయి రవాణా వెనుక ఉన్న ముఠాలపై కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. జిల్లాను కేంద్రంగా చేసుకుని ఇతర ప్రాంతాలకు మత్తు పదార్థాలు తరలిస్తున్న నెట్వర్క్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్నామని వెల్లడించారు. అక్రమ మత్తు పదార్థాల నియంత్రణకు జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహన తనిఖీలను జిల్లావ్యాప్తంగా మరింత విస్తరించనున్నట్లు పోలీసులు తెలిపారు. సరిహద్దు ప్రాంతాలు, ప్రధాన రహదారులపై నిరంతర నిఘా కొనసాగుతోందన్నారు. అనుమానాస్పద కదలికలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని జిల్లా పోలీసులు పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయని తెలిపారు. నేరాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు.







# విద్యా కమిషన్ చైర్మన్ పదవికి ఆకునూరి మురళి రాజీనామా

- **సీఎస్‌కు లేఖ పంపిన విశ్రాంత ఐఏఎస్ అధికారి**
- **బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేశానన్న ఆకునూరి మురళి**

హైదరాబాద్, మే 22 సిరి న్యూస్:

తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ పదవికి విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపించారు. తనకు అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేసినందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆకునూరి మురళి లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ చైర్‌పర్సన్‌గా సేవలందించే అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతం, సంస్కరణలపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి సిఫార్సులతో కూడిన సమగ్ర నివేదికను ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించినట్లు వెల్లడించారు.

"మాకు అప్పగించిన పనిని విజయవంతంగా పూర్తి చేశాం. విద్యా రంగంపై నివేదికను ప్రభుత్వానికి అందించాం. నా బాధ్యత నెరవేరినందున తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ పదవికి రాజీనామా సమర్పిస్తున్నాను" అని ఆకునూరి మురళి తన లేఖలో వివరించారు.

విద్యా రంగంలో కీలక మార్పుల కోసం కమిషన్ విస్తృతంగా అధ్యయనం చేసి నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం. టాస్క్ పూర్తవడంతోనే ఆకునూరి మురళి పదవి నుంచి తప్పుకోవడం రాష్ట్ర రాజకీయ, విద్యా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఎండల గుప్పిట్లో పవర్ పాలిటిక్స్!

మొదటిపేజీ తరువాయి

విధంగా 4,750 మెగావాట్లకు చేరింది. ఎయిర్ కండిషనర్లు, కూలర్ల వాడకం పెరగడంతో గ్రిడ్‌లపై భారం పడుతోంది. అటు నీటి ఎద్దడి నగరవాసులను బెంబేలెత్తిస్తోంది. జలమండలి వాటర్ ట్యాంకర్ల కోసం బుకింగ్ చేసుకున్న రోజులు గడుస్తున్నా సప్లై రాకపోవడంతో సామాన్యులు వీధులకెక్కుతున్నారు. మరోవైపు క్షేత్రస్థాయిలో అన్నదాతల పరిస్థితి దారుణంగా తయారైంది. మొక్కజొన్న, జొన్న, ఆయిల్‌పామ్, పత్తి రైతులు మద్దతు ధరలు లేక, దిగుబడి అమ్ముకోలేక సతమతమవుతున్నారు. కేంద్ర పథకాల సాయాన్ని తక్షణమే పెంచి రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి విజ్ఞప్తి చేసినా, ఇప్పటివరకు స్పష్టమైన హామీ లభించలేదు.



**ట్యాంకర్ల కోసం క్యూ లైన్లు..**

గ్రేటర్ వ్యాప్తంగా నీటి కరవు కోరలు చాస్తోంది. జలమండలి ట్యాంకర్ల కోసం ఆన్‌లైన్ బుకింగ్స్ రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. ఒక ట్యాంకర్ రావడానికి 3 నుంచి 5 రోజులు పడుతుండటంతో ఐటీ కారిడార్‌తో పాటు బస్తీల్లోనూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ ట్యాంకర్ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని జనం డిమాండ్ చేస్తున్నారు.

**ఢిల్లీకి చేరిన కేబినెట్ 'హీట్'..**

ప్రజలు వసతుల కోసం అల్లాడుతుంటే, రాజకీయ నేతలు మాత్రం తమ పదవులను కాపాడుకునే పనిలో పడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణ ఊహాగానాల నేపథ్యంలో ఆశావహుల లాబీయింగ్ ఢిల్లీ స్థాయికి చేరింది. హైకమాండ్ ఎవరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తుందో తెలియక మంత్రుల్లో గుబులు మొదలైంది. మరోవైపు, కల్వకుంట్ల కవిత నేతృత్వంలో 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) నిరసనలు, ప్రతిపక్షాల విమర్శల హోరుతో రాష్ట్ర రాజకీయాలు మరింత అగ్గిరాజేస్తున్నాయి. రాజకీయ విమర్శలు, పొత్తులు, పదవుల పంపకాలు ప్రజాస్వామ్యంలో భాగమే అయినా.. సంక్షోభ సమయాల్లో ప్రజల ప్రాథమిక అవసరాలను పక్కనబెట్టడం సమర్థనీయం కాదని మేధావులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు క్షేత్రస్థాయి సమస్యలపై దృష్టి సారించి, విద్యుత్, నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## సంపాదకీయం



# సవాళ్ల సుడిగుండంలో ప్రజా అవసరాలు

రెండు తెలుగు రాష్ట్రాలు ప్రస్తుతం విభిన్నమైన, అత్యంత కీలకమైన సామాజిక, రాజకీయ, ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఒకవైపు ప్రకృతి ప్రకోపిస్తూ ఎండల రూపంలో ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, మరోవైపు ప్రజల ప్రాథమిక అవసరాలు, రాజకీయ వర్గాల ప్రాధాన్యాల మధ్య సమతుల్యత లోపించడం ఆందోళన కలిగిస్తోంది. పాలనా పరమైన సంస్కరణలు, రాజకీయ విమర్శల హోరు పక్కన పెడితే... క్షేత్రస్థాయిలో సామాన్యుడి ఇబ్బందులను తీర్చడమే తక్షణ కర్తవ్యంగా మారాలి. తెలంగాణ సమాజాన్ని ప్రస్తుతం వేసవి తీవ్రత తీవ్రంగా వేధిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో 4,750 మెగావాట్లకు చేరడం భవిష్యత్ విద్యుత్ సంక్షోభానికి హెచ్చరిక లాంటిది. నీటి ఎద్దడి కారణంగా వాటర్ ట్యాంకర్ల కోసం సామాన్యులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి వస్తోంది. కేవలం నగరాలే కాదు, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. దీనికి తోడు..మొక్కజొన్న, జొన్న, ఆయిల్‌పామ్, పత్తి పండించే రైతాంగం మద్దతు ధరలు, కేంద్ర పథకాల సాయం అందక సతమతమవుతున్నారు. వ్యవసాయ రంగాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో గట్టిగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది.

మరోవైపు తెలంగాణ రాజకీయాలు ఊహించని మలుపులతో అత్యంత వేడెక్కాయి. అధికార కాంగ్రెస్ పార్టీలో మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన లాబీయింగ్ ఢిల్లీ స్థాయిలో ముమ్మరంగా సాగుతోంది. కొందరు మంత్రుల పనితీరు ఆధారంగా మార్పులు ఉంటాయనే ప్రచారం, కొత్తవారికి కేబినెట్‌లో చోటు దక్కే అవకాశాలు పాలనాపరమైన సందిగ్ధతకు తావిస్తున్నాయి. దీనికి తోడు కల్వకుంట్ల కవిత 'తెలంగాణ రాష్ట్ర సేన' (టీఆర్ఎస్) పేరిట సరికొత్త రాజకీయ పంథాను ఎంచుకోవడం, రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బిఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావు విమర్శల పదును పెంచడం, పార్లమెంట్ స్థానాల పునర్విభజనపై (డీలిమిటేషన్) భవిష్యత్ సవాళ్లు, రాష్ట్ర రాజకీయాలను నిరంతరం చర్చనీయాంశంగా ఉంచుతున్నాయి. రాజకీయ వర్గాలు కేబినెట్ బెర్తులు, పొత్తులు, సవాళ్లపైనే దృష్టి పెడితే, క్షేత్రస్థాయిలో ప్రజల ఈతిబాధలు పట్టించుకునేవారే కరువవుతారు.

ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, రాజకీయంగా వేడి ఏమాత్రం తగ్గడం లేదు. అమరావతి రాజధాని నిర్మాణం, నియోజకవర్గాల పునర్విభజన బిల్లు వంటి అంశాలపై పాలకుల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. బిల్లు వీగిపోవడం వల్ల దక్షిణ భారతదేశానికి జరిగే నష్టంపై గళమెత్తడం ఎంత ముఖ్యమో, అదే సమయంలో రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడం కూడా అంతే ముఖ్యం. రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమే అయినా, అవి ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేలా ఉండకూడదు. ఈ పరిస్థితుల్లో పాలకులకు కావాల్సింది తాత్కాలిక ఉపశమనాలు కాకుండా దీర్ఘకాలిక ప్రణాళికలు కావాలి. నీటి వనరుల నిర్వహణ, విద్యుత్ కొరత రాకుండా ముందస్తు చర్యలు, రైతులకు భరోసా కల్పించడంపైనే ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. అప్పుడే సంక్షేమ రాజ్యస్థాపన సాధ్యమవుతుంది. ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి చూపడమే ఇరు రాష్ట్ర ప్రభుత్వాల ముందున్న అసలైన పరీక్ష.

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- జొన్నలకు ఎన్నడూ లేనివిధంగా మద్దతు ధర
- ధాన్యం విక్రయించిన 72 గంటల్లోనే డబ్బులు జమ
- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి
- గొల్లపల్లి, కొండాపూర్ గ్రామాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**సంగారెడ్డి, మే 22, సిరి న్యూస్:**



రాష్ట్రంలో రైతులు పండించిన చివరి ధాన్యపు గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని గొల్లపల్లి, కొండాపూర్ గ్రామాలలో కొత్తగా ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అనంతరం నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పక్కా రైతు పక్షపాతి అని, అన్నదాతల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని కొనియాడారు. ఇందులో భాగంగానే జొన్న పంటకు గతంలో ఎన్నడూ లేనివిధంగా క్వింటాకు రూ. 2,699 మద్దతు ధర కల్పించినట్లు వెల్లడించారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు అమ్ముకుంటూ మోసపోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించుకోవాలని కోరారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి పంట సాగు ధృవీకరణ పత్రం, పట్టాదారు పాస్ బుక్, బ్యాంకు ఖాతా పుస్తకం మరియు ఆధార్ కార్డ్ జిరాక్స్ ప్రతులను వెంట తెచ్చుకోవాలని సూచించారు. రైతులు పంట విక్రయించిన 72 గంటల్లోనే నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, గన్నీ బ్యాగులు, తార్పాలిన్లు సరిపడా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సొసైటీ చైర్మన్లు శ్రీకాంత్ రెడ్డి, మాణిక్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, నర్సింలు, వెంకటేశం గౌడ్, జాకీర్, ప్రభుదాస్, విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యసాధనతోనే ఉన్నత శిఖరాలు

- పోలీస్ సిబ్బంది, వారి పిల్లల కోసం ప్రతి శుక్రవారం 'స్పార్క్'
- పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం స్టడీ హాల్ ఏర్పాటు
- విధులతో పాటు పిల్లల భవిష్యత్తుపై సిబ్బంది దృష్టి పెట్టాలి
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి, మే 22, సిరి న్యూస్:**

పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న పోలీసు కుటుంబాల పిల్లలు మరియు పోలీస్ సిబ్బంది వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధి సాధించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'స్పార్క్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. శుక్రవారం జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి హాజరై ఖాకీ కిడ్స్‌కు భవిష్యత్తులో ఉన్న అవకాశాలు, విద్య ప్రాముఖ్యత, లక్ష్య సాధన, క్రమశిక్షణ మరియు వ్యక్తిత్వ వికాసంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కష్టపడి చదివితే విజయం సాధించడం సులభమవుతుందని అన్నారు. నేటి ఆధునిక కాలంలో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని కేవలం మంచి విషయాలకే ఉపయోగించుకుంటూ ప్రగతి పథంలో ముందుకు సాగాలని సూచించారు. పోటీ పరీక్షల్లో రాణించాలనుకునే వారు గత సంవత్సరాల మోడల్ ప్రశ్నపత్రాలను రిఫర్ చేయాలని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా దినపత్రికలు చదివే అలవాటును పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఖాకీ కిడ్స్‌కు చదువు పట్ల మరింత ప్రోత్సాహం అందించేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో త్వరలోనే ఒక ప్రత్యేక స్టడీ హాల్‌ను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎస్పీ ప్రకటించారు. అలాగే, పోలీసు సిబ్బంది తమ కఠినమైన విధులతో పాటు కుటుంబ సభ్యుల




భవిష్యత్తుపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, పిల్లల ఉన్నత విద్యాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అర్హత కలిగిన సిబ్బంది కూడా సమయాన్ని కేటాయించుకుని చదువుతూ విభాగాంతర పోటీ పరీక్షల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ 'స్పార్క్' కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం నిర్వహిస్తామని, పోలీస్ కుటుంబాల పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, ఖాకీ కిడ్స్ మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో విద్యుత్ అధికారి

- 25 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ విద్యుత్ అధికారి ఏడిఈ రమణ రెడ్డి
- కాంట్రాక్టర్ దగ్గర డబ్బులు డిమాండ్ చేసిన అధికారి

**నర్సాపూర్ మే 22 (సిరి న్యూస్)**

నర్సాపూర్ పట్టణంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరింగ్ విద్యుత్ కార్యాలయంలో ఏసీబీ అధికారి డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు ఈ దాడులలో విద్యుత్ శాఖలో డివిజనల్ ఇంజనీరింగ్ అధికారి రమణారెడ్డి 25 వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం కార్యాలయంలో పట్టుబడ్డారు ఈ సందర్భంగా ఏసీబీ అధికారి సుదర్శన్ మాట్లాడుతూ సదురు కాంట్రాక్టర్ కు బిల్లు చెల్లింపు విషయంలో నర్సాపూర్ విద్యుత్ శాఖలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరింగ్ అధికారి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని






ఫిర్యాదు వచ్చిందని 2023 నుండి 2025 సంవత్సరం వరకు 11 విద్యుత్ శాఖకు సంబంధించి కాంట్రాక్టర్ పనులను పూర్తి చేశారని ఈ పనులకు కాంట్రాక్టర్ కి ప్రభుత్వం నుండి సుమారు ₹3,13,000 (మూడు లక్షల పదమూడు వేల రూపాయలు) బిల్లులు రావాల్సి ఉంది ఈ పెండింగ్ బిల్లులను పై అధికారులకు పంపడానికి ఏడీఈ రమణారెడ్డి మొదట ₹30,000 డిమాండ్ చేశారని .కాంట్రాక్టర్ అంత మొత్తాన్ని ఇచ్చుకోలేనని చెప్పడంతో రమణారెడ్డి లంచం మొత్తాన్ని తగ్గించి, కనీసం ₹20,000 నుండి ₹25,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు చివరకు ₹25,000/- ఇచ్చేందుకు ఒప్పందం కుదిరిందని శుక్రవారం కాంట్రాక్టర్ నుండి ఏడీఈ రమణారెడ్డి ₹25,000 లంచం తీసుకుంటుండగా ఆయనను రెడ్ హ్యాండుగా పట్టుకున్నామని తెలిపారు అదుపులో తీసుకొని కార్యాలయంలో ,ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం కార్యాలయాలలో అవినీతికి పాల్పడిన డబ్బులు డిమాండ్ చేసిన అధికారుల సమాచారాన్ని అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1064,లేదా 9154388947 కి ఫోన్ చేయాలని డిఎస్పి సుదర్శన్ అన్నారు

# పక్కా ఓటర్ల జాబితా తయారే లక్ష్యం



- వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ మే,22(సిరిన్యూస్)**

ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన పక్కా ఓటర్ల జాబితాను రూపొందించడమే జిల్లా యంత్రాంగం ,రాజకీయ పార్టీల ముఖ్య లక్ష్యంగా ఉండాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జిల్లా యంత్రాంగం అత్యంత పారదర్శకంగా, ఖచ్చితమైన విచారణతో బాధ్యతాయుతంగా పనిచేస్తుందని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన చేయాలని సూచించారు. ప్రతి రాజకీయ పార్టీ తక్షణమే తమ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని, అధికారులు మరియు రాజకీయ నాయకులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ జూన్ 15 నుంచి 24 వరకు బూత్ స్థాయి అధికారులకు శిక్షణ, ప్రిపరేషన్, ప్రింటింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి సమగ్ర విచారణ చేపడతారని తెలిపారు. జూలై 24న పోలింగ్ కేంద్రాలను ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించడం జరుగుతుందని, జూలై 31న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురిస్తామని వివరించారు.స్థానికంగా మరణించిన వారి పేర్ల తొలగింపు, వలస వెళ్లిన వారిని గుర్తించడం, అర్హులైన కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడం వంటి బాధ్యతలు బీఎల్ఓలపై ఉంటాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

- 11వ వార్డులో విస్తృత పర్యటన
- స్థానికులతో మాట్లాడి సమస్యల వివరాలు సేకరించిన మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్

**గుమ్మడిదల, మే 22 (సిరి న్యూస్):**





గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ శుక్రవారం కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. వార్డులోని గల్లీలను పరిశీలిస్తూ స్థానికులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డ్రైనేజీ సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, వీధి దీపాల కొరత, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన అంశాలను కాలనీవాసులు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన కుమార్ గౌడ్ వాటిని ప్రాధాన్యత ఆధారంగా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల సమగ్ర అభివృద్ధికి పాలకవర్గం కట్టుబడి పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, సీకేజీ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కృషి.

పక్కాగా జనగణన

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**రామాయంపేట, (చేగుంట) మే 22 (సిరి న్యూస్)**

ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. శుక్రవారం చేగుంట మండలం రెడ్డిపల్లి లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, జనగణన సర్వే ను పరిశీలించారు.ప్రభుత్వం రైతుల నుంచి ప్రతి గింజను కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి అపోహలు, ఆందోళనలు పెట్టుకోవద్దని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో వారి పక్షాన నిలుస్తుందని పేర్కొన్నారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సకాలంలో జరుగుతుందని తెలిపారు.ధాన్యం త్వరగా మిల్లులకు తరలించాలన్నారు.ట్రక్ తో... కేంద్రానికి సంబంధించిన ఎవరో ఒకరు తప్పకుండ వెళ్లి ఆన్ లోడింగ్ త్వరగా అయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు .ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు చేస్తే....రైతుల ఖాతా లో నగదు జమ ఆలస్యం కాదన్నారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తున్నదని ఆమె వివరించారు.రైతుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు.పకడ్బందీగా జనగణన చేపట్టాలని, ఇండ్ల గణనలో సరిఅయిన సంఖ్యలను నమోదు చేయాలన్నారు. ఎన్యుమరేటర్లు ఏదైనా సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి,అధికారులు, తహసిల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలి..

బీఆర్ ఎస్ టౌన్ ప్రెసిడెంట్ పరమేష్ యాదవ్ డిమాండ్

మంజీర పైప్ లైన్ పగిలిపోవడంతో కాలనీవాసుల ఇబ్బందులు

షాపులోకి చేరిన నీరు.. వ్యాపారికి నష్టం

కలుషిత తాగునీటిపై స్థానికుల ఆందోళన

వెంటనే చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులకు విజ్ఞప్తి



**రామచంద్రపురం, మే 22 (సిరి న్యూస్):**



రామచంద్రపురం డివిజన్‌లో తాగునీటి సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయని స్థానిక నాయకుడు పరమేష్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి సమీపంలో మంజీర వాటర్ పైప్‌లైన్ పగిలిపోవడంతో భారీగా నీరు లీకై సమీపంలోని ఓ షాపులోకి చేరి నష్టం కలిగిందన్నారు.ఘటనపై స్పందించిన పరమేష్ యాదవ్ జలమండలి (HMWS) అధికారులను సంఘటనా స్థలానికి పిలిపించి పరిస్థితిని వివరించారు. కాలనీలో సరైన మంచినీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వస్తున్న నీరు కూడా తరచుగా కలుషితమవుతోందని తెలిపారు. తాగునీటిలో మురుగునీరు కలవడం ప్రజల ఆరోగ్యాలకు ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.“ప్రజలకు ఎప్పటికప్పుడు స్వచ్ఛమైన తాగునీటిని అందించడం అధికారుల బాధ్యత. పైప్‌లైన్ పగిలినప్పుడు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలి. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలి” అని పరమేష్ యాదవ్ డిమాండ్ చేశారు.కాలనీలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజల ఇబ్బందులను నిర్లక్ష్యం చేయవద్దని ఆయన అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీ సాయి నగర్ కాలనీ మాజీ అధ్యక్షుడు పెంట రెడ్డి, జైపాల్ రెడ్డి, నారాయణ, రాజు, భూపాల్ రెడ్డి, మురళి రెడ్డి, రాంబాబు, అప్పల భాస్కర్, బలరాం, నాగేష్ తదితరులతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

## నీటిలో మునిగి వ్యక్తి మృతి

**పాపన్నపేట మే 22 (సిరి న్యూస్) :**



ఏడుపాయల చెక్ డ్యాం సమీపంలో ప్రమాదవశాత్తూ నీట మునిగి ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన ప్రకారం వివరాలు..సంగారెడ్డి జిల్లాలోని నవాబ్ పేట గ్రామానికి చెందిన కంకరి నాగరాజు(31)కు అపుడపుడు ఫిట్స్ వస్తుంది.అమ్మవారి దర్శనం కోసం శుక్రవారం ఉదయం ఏడుపాయలకు వచ్చాడు.ఏడుపాయల చెక్ డ్యాం సమీపంలో స్నానం చేయడానికి నీటిలోకి దిగాడు.నీటిలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ నీట మునిగాడు.కాసేపటికి అటుగా వెళ్లిన స్థానికులు ఒడ్డుపై ఉన్న చెప్పులు, బట్టలు, ఫోన్ ను గుర్తించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు.పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి తండ్రి మానయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# శ్రామికుల సంక్షేమ ప్రభుత్వం

- మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ మొల్సాబ్
- సీఎం, మంత్రి,ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

**మెదక్ మే,22(సిరిన్యూస్)**



కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హాఫిజ్ మొల్సాబ్ అన్నారు.కాంగ్రెస్ పాలనలో కార్మికులకు 20.000 రూపాయల వేతనం పెంచడంతో శుక్రవారం మెదక్ రాందాస్ చౌరస్తా, హవెలి ఘనపూర్ మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి వివేక్ వెంకటస్వామి,ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ గారి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు.తెలంగాణలోని దాదాపు (1 కోటి 11 లక్షల) మంది కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించిందన్నారు.శ్రామి క లోకం సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ, వారి కనీస వేతనాలను పెంచుతూ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు.పెంచిన కొత్త వేతనాలు జూన్ 1వ తేదీ నుండి అమల్లోకి రానున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రకటించారన్నారు.కనీస వేతనాల పెంపు పట్ల మెదక్ కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేసారు.మెదక్ నియోజకవర్గ కార్మికుల తరపున కృతజ్ఞతలు తెలిపారు."నిరంతరం పేదలు, శ్రామికుల సంక్షేమం కోసం పాటుపడే కాంగ్రెస్ ప్రభుత్వం... ఈ నిర్ణయంతో మరోసారి కార్మిక పక్షపాతి అని నిరూపించుకుందన్నారు. 1.11 కోట్ల మంది కార్మికుల కుటుంబాల్లో ఈ నిర్ణయం ఆర్థిక భరోసాను కల్పిస్తూ కొత్త వెలుగులను నింపుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గంగాధర్,హవెలి ఘనపూర్ మండల అధ్యక్షులు కిరణ్ గౌడ్,కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కౌమార దశలో ఆహారం తీసుకోనట్లయితే రక్తహీనత





- జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి
- కౌమార బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన సదస్సు

**జోగిపేట, మే 22, (సిరి న్యూస్):**

కౌమార దశలో సరైన అహారం తీసుకోనట్లయితే రక్తహీనత బలహీనతలు వస్తాయని జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా అందోల్–జోగిపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కౌమార బాలికల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 10 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసున్న బాలికలకు ఆరోగ్య సూత్రాలు, పౌష్టికాహార ప్రాధాన్యతపై వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రజా పాలనలో మహిళలు, బాలికల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వైస్ చైర్మన్ చిట్టిబాబు ముదిరాజ్ మాట్లాడుతూ ఆడపిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం బాగుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాలికల చదువు, ఆరోగ్యం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు, స్టాఫ్ నర్సులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన బాలికలు పాల్గొన్నారు. బాలికలకు 6 రకాల పుస్తకాలలను అందజేసారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ రవీందర్,ఇంచార్జి సూపరిండెంట్ అశోక్ ,డాక్టర్లు నితిన్, బాంధవి, మెప్మాటీఎంసీ బిక్షపతి గౌడ్ , మెప్మా ఆర్పీ లు,ఆశా వర్కర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# గీతంలో వినూత్న ‘టాక్ టైమ్’ కార్యక్రమం

- విద్యార్థుల సాధికారతే లక్ష్యంగా ప్రత్యేక మార్గదర్శనం
- డాక్టర్ రోజీనా మాథ్యూ ఆధ్వర్యంలో ప్రారంభం
- విద్య, కెరీర్, వ్యక్తిగత అభివృద్ధిపై ముఖాముఖి చర్చలకు అవకాశం

**రామచంద్రపురం,(పటాన్‌చెరు), మే 22, (సిరి న్యూస్):**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థుల విద్యా, వృత్తి, వ్యక్తిగత అభివృద్ధికి అర్థవంతమైన మార్గదర్శనం అందించే లక్ష్యంతో ‘టాక్ టైమ్’ పేరుతో వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. గీతం వృత్తిపరమైన సలహాల కేంద్రంలోని శిక్షణ, మార్గదర్శకత్వం, వృత్తిపరమైన సలహాలు (టీఎంసీజీ) డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమ విద్య, కెరీర్, నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిగత ఆందోళనలు, వృత్తి అవకాశాలకు సంబంధించిన అంశాలపై నేరుగా చర్చించే అవకాశం పొందనున్నారు. 2026 మే 11 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. శని, ఆదివారాలు మినహా మిగిలిన అన్ని పనిదినాల్లో విద్యార్థులకు 15 నిమిషాల వ్యక్తిగత సంభాషణ సమయం కేటాయించనున్నారు.నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ సంసిద్ధత, కెరీర్ మార్గదర్శనం, వృత్తిపరమైన అభివృద్ధి, వ్యక్తిగత సందేహాలు వంటి అంశాలపై విద్యార్థులు స్వేచ్ఛగా మాట్లాడేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు తమ ఆలోచనలను బహిరంగంగా పంచుకోవడం, సందేహాలకు స్పష్టత పొందడం, విద్యా మరియు వృత్తి ఎదుగుదలకు సంబంధించిన సవాళ్లపై కొత్త దృక్కోణాలు తెలుసుకోవడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని డాక్టర్ రోజీనా మాథ్యూ పేర్కొన్నారు.స్లాట్ల సంఖ్య పరిమితంగా ఉన్నందున, విద్యార్థులు ముందుగానే అపాయింట్‌మెంట్‌లు బుక్ చేసుకుని స్పష్టమైన చర్చాంశాలతో హాజరుకావాలని ఆమె సూచించారు. ఇందుకోసం క్యూఆర్ కోడ్ లేదా వెబ్ లింక్ ద్వారా రిజర్వేషన్ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

# ఇస్నాపూర్‌లో మౌలిక వసతుల విస్తరణకు శ్రీకారం





- సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి శంకుస్థాపన
- పారిశ్రామిక ప్రాంతానికి అనుగుణంగా మౌలిక వసతుల కల్పనపై దృష్టి
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**రామచంద్రపురం,(పటాన్‌చెరు), మే 22, (సిరి న్యూస్):**

ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి మరింత వేగం పెంచుతూ పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. పాశమైలారం, ఇస్నాపూర్, చిట్కుల్ వార్డుల్లో అంతర్గత మురుగునీటి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మున్సిపల్ ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇస్నాపూర్ పారిశ్రామిక ప్రాంతంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల విస్తరణ చేపడుతున్నామని తెలిపారు. పరిశ్రమల్లో ఉపాధి పొందుతున్న అనేక మంది ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకుంటుండటంతో కాలనీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ నిధులతో పాటు పరిశ్రమల సిఎస్ఆర్ నిధులను వినియోగిస్తూ రోడ్లు, డ్రైనేజీలు వంటి పనులను చేపడుతున్నామని తెలిపారు. ప్రతి వార్డులో అభివృద్ధి సమానంగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, పలువురు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యం

- 1 కోటి 11 లక్షల మంది కార్మికులకు కనీస వేతనాలు పెంపు.
- రామాయంపేట మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా.

**రామాయంపేట, మే 22 (సిరి న్యూస్)**



ఒక కోటి 11 లక్షల మంది కార్మికులకు కనీస వేతనాలు పెంచుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయానికి రామాయంపేట మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్త హర్షం ప్రకటించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, మరియు కార్మికశాఖ మంత్రి వెంకటస్వామి, మెదక్ శాసనసభ్యులకు మైనంపల్లి రోహిత్ రావు గారి చిత్రపటాలకు రామాయంపేట మున్సిపల్ కార్మికులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు.తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రివర్యులు ఏ రేవంత్ రెడ్డి కార్మికుల కనీసం వేతనాలను పెంచుతూ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం జూన్ 1 నుంచి అమలులోకి వస్తుందన్నారు.ఈ సందర్భంగా రామాయంపేట పట్టణంలో పట్టణ అధ్యక్షులు చింతల స్వప్న స్వామి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా అధ్యక్షతన రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ వెంకటస్వామి, మరియు స్థానిక శాసన సభ్యులు మైనంపల్లి రోహిత్ రావ్ గారి చిత్ర పటాలకు పాలభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు రమేష్ రెడ్డి ,మండల అధ్యక్షులు బండారు మహేందర్ రెడ్డి , కౌన్సిలర్లు గూగులోత్ రవి, దేవుని రంజిత్ , గజవాడ నాగరాజ్ కోఆ షన్స్ సభ్యులు దేమే యాదగిరి, గౌస్ ,డిసిసి ఉపాధ్యక్షులు చింతల యాదగిరి, కార్యదర్శి పోచమ్మల గణేష్ ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జీడిపల్లి సత్యం,డాకిస్వామి , విప్లవ్ , దేవుని నర్సింలు, భూమా రమేష్ , అశోక్ ,దారం సంతోష్ తొండవల్లి యాదగిరి , పచంటి రాము , కుమార్ సాగర్, శంకర్, భాస్కర్, బోట్ల బాబు , మోబిన్ యూత్ కాంగ్రెస్ నాయకులు చింతల నరేష్ మంగళ్ పవన్ ,నరేందర్ , భాను ,నితిన్ సుధీర్,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.





# పారిశుధ్యం తొలిగించి పర్యాటకం వైపు

- పురాతన కట్టడాలపై ప్రత్యేక చర్యలు.
- పర్యాటక శోభ సంతరించే విధంగా ఏర్పాట్లు.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

**మెదక్ మే.22(సిరిన్యూస్)**





జిల్లాలో పర్యాటక శోభ సంతరించే విధంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.పర్యాటక వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక పారిశుధ్ధ్య కార్యక్రమాల నేపథ్యంలో శుక్రవారం మెదక్ పట్టణం దాయార వీధిలోని పురాతన కట్టడాలైన స్వామి మెట్ల బావి,దేవాలయాలను జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ,అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మెదక్ ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు యువత,ఇతర ప్రజాప్రతినిధులు గ్రామస్తులతో కలిసి జిల్లా కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని పర్యాటక శోభ సంతరించే విధంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పర్యాటక ప్రాంతాలను తుది రూపు తీసుకువచ్చే విధంగా పర్యాటక పురావస్తు శాఖ అధికారుల సమన్వయంతో మౌలిక వసతులు కల్పనపై పటిష్ట చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం

- మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ ధరకే పంట కొనుగోలు
- నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే నిధుల జమ
- మంత్రి దామోదర రాజనర్సింహ
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక స్టాల్

**సంగారెడ్డి, సిరి న్యూస్:**



జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో, గోద్రెజ్ అగ్రోవేట్ సంస్థ సౌజన్యంతో ప్రత్యేక ఆయిల్ పామ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగుకు సంబంధించిన వివరాలు, రైతులకు అందుతున్న ప్రోత్సాహకాలను జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు మంత్రికి కూలంకషంగా వివరించారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. రైతులకు స్థిరమైన మరియు అధిక ఆదాయాన్ని అందించే పంటగా ఆయిల్ పామ్‌ను ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. రైతాంగాన్ని ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ పంట సాగులో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయడం జరుగుతుందని, పంటకు సంబంధించిన చెల్లింపులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే జమ అయ్యేలా పారదర్శకమైన విధానాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు అధికారులు, రైతులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు, గోద్రెజ్ అగ్రోవేట్ సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

# ఆంక్షలు లేకుండా జొన్నలు కొనుగోలు చేయాలి

- ప్రభుత్వ నిబంధనల వల్ల దళారులు లాభపడుతున్నారు
- కేంద్రాల వద్ద తార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలి
- సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి, మే 22, సిరి న్యూస్:**




సదాశివపేట పట్టణంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం ఆయన ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నిన్ననే తాము జిల్లా కలెక్టర్‌తో సమావేశమై వెంటనే జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. రైతులు పంటను మార్కెట్‌కు తీసుకొచ్చి రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి రావడం దారుణమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ.. సదాశివపేట పరిధిలో మొత్తం 4 వేల 693 ఎకరాల్లో జొన్న పంట సాగు జరిగిందని, ఎకరానికి 30 నుండి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోందని తెలిపారు. అయితే, ప్రభుత్వం మాత్రం పరిమిత క్వింటాళ్లనే కొనుగోలు చేస్తోందని విమర్శించారు. కనీసం ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం విధించిన పరిమితుల కారణంగా రైతులు బయట మార్కెట్‌లో తక్కువ ధరలకు జొన్నలను అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందని, పండించేది రైతు.. లాభపడేది దళారులా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలు పడితే రైతుల పంట తడిసి నష్టపోయే ప్రమాదం ఉందని, వెంటనే తార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, తూకం యంత్రాలు, షెడ్లు వంటి సౌకర్యాలు సరిపడా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కిసాన్ సంఘ్ అధ్యక్షులు నరసింహారెడ్డి, అంజన్న, అక్బర్ హుస్సేన్, చీల మల్లన్న, ప్రజాప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.

# క్రిస్టియన్ల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం..

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- బండలగూడలో నూతన ప్రార్థనా మందిరం ప్రారంభం
- ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ





**రామచంద్రపురం,(పటాన్‌చెరు), మే 22, (సిరి న్యూస్):**

"నియోజకవర్గంలోని క్రిస్టియన్ సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం" అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిఅన్నారు.జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని బండలగూడ జీఎంఆర్ మార్గ్‌లో నూతనంగా నిర్మించిన ప్రార్థనా మందిరాన్ని శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజంలో ప్రేమ, దయ, సేవాభావం పెంపొందించడంలో ఆధ్యాత్మిక కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి క్షమ, నిస్వార్థ సేవ, మానవత్వాన్ని నేర్పిస్తున్నాయని పేర్కొన్నారు.నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే పలు కేంద్రాల నిర్మాణానికి సహకారం అందించామని, బండలగూడలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రానికి కూడా అవసరమైన సహకారం అందించామని తెలిపారు. భవిష్యత్తులో కూడా పూర్తి మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఫాదర్ ఆండ్రూస్ తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యరెడ్డి వర్మ యువతకు ఆదర్శం

## ఆయన సేవలు చిరస్మరణీయం

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

## కలెక్టరేట్ లో ఘనంగా జయంతి వేడుకలు




**సంగారెడ్డి, సిరి న్యూస్:**

సామాజిక సమానత్వం, విద్యా విస్తరణ మరియు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కొనియాడారు. భాగ్యరెడ్డి వర్మ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్, భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్యను అందించేందుకు, వారిలో ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు భాగ్యరెడ్డి వర్మ చేసిన పోరాటాలు అమోఘమైనవని పేర్కొన్నారు. నేటి యువత ఇటువంటి మహనీయుల జీవిత విశేషాలను, ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ శ్రేయస్సుకై పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సమానత్వ భావనతో ముందుకు సాగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొని నివాళులర్పించారు.

# కాఫీ మరీ ఎక్కువగా తాగేయకండి..

రోజూ కాఫీ తాగితే గుండెజబ్బులు రావని.. క్యాన్సర్కు కూడా దూరం అవ్వొచ్చని అప్పుడప్పుడు మనకు కొన్ని పరిశోధనలు బయటకు వస్తుంటాయి. అయితే కాఫీ మరీ ఎక్కువగా తాగినా ప్రమాదమేనని తాజాగా నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాఫీలో ఉండే కెఫిన్ శరీరానికి చాలా ప్రమాదమని పరిశోధకులు చెబుతున్నారు. చాలా మంది కాఫీతాగనిదే డే స్టార్ట్ అవదు. కానీ కాఫీలో ఉండే కెఫిన్ చాలా ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోజుకు 1 గ్రాము కంటే ఎక్కు కెఫిన్ ను తీసుకుంటే మెదడు తింటుందని చెబుతున్నారు. ఓ పరిశోధన ప్రకారం పార్కిన్సన్స్ వ్యాధి బారిన పడిన వారిలో 8 శాతం మంది కెఫిన్ వల్ల ఆ వ్యాధికి గురైనట్లు బయటపడింది. కెఫిన్ ఎక్కువగా తీసుకుంటే చేతులు వణకడం లాంటి లక్షణాలు కనిపిస్తాయని చెబుతున్నారు.



### తరుచూ యూరిన్ వస్తుంది..

కెఫిన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల ఎక్కగా మూత్రం వెళ్లే అవకాశం ఉంది. దీంతో డీహైడ్రేట్ అయి తలనొప్పటికి దారితీస్తుందంటున్నారు. కెఫిన్ తగ్గిస్తే తలనొప్పి సమస్య తగ్గే అవకాశం ఉందని పరిశోధనలు నిరూపిస్తున్నాయ్. నిద్రలేమి సమస్యకు కూడా కెఫిన్ కారణమని తెలుస్తోంది.

### బీపీ వచ్చే చాన్స్

కెఫిన్ ఎక్కువగా తీసుకుంటే రక్తపోటు కూడా ఎక్కువయ్యే అవకాశముంది. కెఫిన్తో అడ్రినలిన్ ఎక్కువగా విడుదలై బ్లడ్ ప్రెజర్ను పెరుగుతుంది. రోజు రెండు నుంచి మూడు, నాలుగు కప్పల కాఫీ తాగే వారిలో బ్లడ్ ప్రెజర్ ఎక్కువగా ఉంటుంది.

### 10 కాఫీ కప్పల్లో 1గ్రామ్ కెఫిన్

10 కాఫీ కప్పలు తాగితే 1 గ్రాము కెఫిన్ తీసుకున్నట్లు. అలా 1.2 గ్రాముల కంటే ఎక్కువ కెఫిన్ ను తీసుకుంటే తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. కాబట్టి మితంగా కాఫీ తాగితేనే ఆరోగ్యం.

# మాట తడబడుతోందా..

సత్తి చికాకు పెట్టే సమస్య. మాట్లాడటంలో చాలా ఇబ్బంది కలిగిస్తుంది. కొన్నిసార్లు ఒక్క అక్ష రమే బయటకు రావొచ్చు. మొత్తం పదం, వాక్యం పలకటం కష్టమవుతుంది. నత్తి పిల్లల్లో.. అదీ అబ్బాయిల్లో తరచూ చూస్తుంటాం. ముఖ్యంగా 2-5 ఏళ్ల వయసులో ఎక్కువ. పెద్దవారిలో సుమారు ఒక శాతం మందిలో, పిల్లల్లో దాదాపు 5 శాతం మందిలో కనిపిస్తుంటుంది. సాధారణంగా నత్తి గల పిల్లలు 70 నుంచి 90 శాతం మంది ఏడేళ్ల వయసుకు వచ్చేసరికి వాళ్లంతట వారే బయటపడుతుంటారు. పెద్దవారిలో హఠాత్తుగా నత్తి రావటం అరుదు. ఇంతకీ పిల్లలకు నత్తి ఎందుకొస్తుంది? నిజానికి వీళ్లు తెలివి గలవారు. కొన్నిసార్లు ఆలోచనల కన్నా మాట్లాడటానికి అవసరమైన కండర కదలికల సమన్వయ వేగం తక్కువగా ఉండొచ్చు. అంటే మాట్లాడే వేగం కన్నా ఆలోచనల వేగం పెరిగినప్పుడు పదాలు, వాక్యాలు నత్తి నత్తిగా వస్తుంటాయి. దీంతో గాబరా, ఆదుర్దాకు లోనవుతారు. సమస్య తీవ్రమవుతూ వస్తుంటుంది. నత్తికి కొంతవరకు జన్యువులూ దోహదం చేయొచ్చు. కొన్ని కుటుంబాల్లో ఎక్కువ మందికి నత్తి ఉండటం చూస్తుంటాం. ఇది ఒత్తిడి, ఆందోళనకు గురైనప్పుడు మరింత ఎక్కువవుతుంది. కొందరికి అనుకరణతోనూ నత్తి అంటుకోవచ్చు.



### మాట్లాడుతూ ఉండాలి..

సత్తిని ఉన్నట్టుండి తగ్గించే మందేదీ లేదు. కానీ వీరికి స్పీచ్ థెరపీ బాగా ఉపయోగ పడుతుంది. ఈ చికిత్సతో పాటు ఇంట్లో పిల్లలకు మాట్లాడటంలో కొంత శిక్షణ ఇస్తే మరింత ప్రయోజనం కనిపిస్తుంది. నోటి నుంచి మాటలు వెలువడటానికి ముందే మెదడులో వాక్యాలు ఏర్పడతాయి. కాబట్టి నెమ్మదిగా మాట్లాడేలా అలవాటు చేయటం ముఖ్యం. రాగం తీస్తున్నట్టు మాట్లాడేలా చూడటమూ మంచిదే. సత్తి ఎక్కువగా ఉన్నవారు కూడా పాడేటప్పుడు తడబడరు. అందువల్ల పాటలు పాడటం, గాత్ర సంగీతం నేర్పించాలి. కొందరు నత్తిగా మాట్లాడుతున్నప్పుడు పిడికిలి బిగించటం, కళ్లు మిటకరించటం, కండరాలు బిగించటం వంటివీ చేస్తుంటారు. అందుకే ఆందోళనతో నత్తి వస్తుందని భావిస్తుంటారు. కానీ ఆందోళన తగ్గించే మందులతో ఎలాంటి ఉపయోగమూ ఉండదని బయటపడింది. సత్తికి తొలిదశలోనే చికిత్స చేయటం మంచిది, లేకపోతే ఆత్మ విశ్వాసం కొరవడే ప్రమాదముంది. నలుగురితో కలవలేక చదువులో వెనకబడొచ్చు, ఉద్యోగాల్లో పూర్తి స్థాయిలో రాణించకపోవచ్చు.






# టాటూల వల్ల వచ్చే ప్రమాదాలు ఇవే

వయసుతో సంబంధం లేకుండా ఇప్పుడు టాటూలు వేయించుకునే వారి సంఖ్య పెరిగిపోయింది. చర్మం కాస్త తేటగా ఉంటే చాలు... అక్కడ ఏదో ఒక టాటూ వేయించుకోవాలన్న కోరిక పెరిగిపోతోంది. ఎక్కువ మంది చేతులపై, భుజాలపై టాటూలను వేయించుకుంటున్నారు. న్యూయార్క్లోని బింగ్హామ్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు వల్ల ఆరోగ్యం పై ఎలాంటి ప్రభావం కనిపిస్తుందో తెలుసుకునేందుకు అధ్యయనం నిర్వహించారు. అమెరికాలోని చలామణిలో ఉన్న తొమ్మిది టాటూ ఇంక్ బ్రాండ్లను విశ్లేషించారు. వాటిలో 45 రకాల సమ్మేళనాలు ఆరోగ్య సమస్యలతో ముడిపడి ఉన్నట్టు తేలింది. ఆ 45 సమ్మేళనాల పేర్లను కూడా బహిర్గతం కానివ్వలేదు. ప్రజలు తమకు తెలియకుండానే టాటూలతో చర్మ సమస్యలను, ఆరోగ్య ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నట్టు అధ్యయనకర్తలు చెబుతున్నారు.

నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ చెబుతున్న ప్రకారం టాటూ ఇంకులో పాలిథిన్ గ్లైకాల్ అనే రసాయనం ఉంటుంది. ఇది కొన్ని రకాల ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడుతుంది. అలాగే మరొక రసాయనం ఇందులో ఉంది. దాని పేరు 2-ఫినాక్సిథెనాల్ కొన్ని టాటూ ఇంకులలో ఈ ప్రమాదకరమైన పదార్థాన్ని గుర్తించారు. ఈ రసాయనం అధిక మోతాదులో చర్మంలోనికి ఇంకితే... చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు, కాలేయ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అలాగే మూత్రపిండాలు, నరాలకు కూడా హాని కలుగుతుంది.

టాటూల్లోని రసాయనాలు దీర్ఘకాలంలో ఆరోగ్యం పై ప్రభావాన్ని చూపిస్తాయి. అవి చర్మం ద్వారా శరీరంలోకి ఇంకుతాయి. శరీరం నుంచి ఇతర అవయవాలకు కూడా చేరే అవకాశం ఉంది. కాబట్టి వీలైనంత వరకు టాటూలకు దూరంగా ఉండటమే మంచిది.

గతంలో కూడా టాటూలపై అనేక అధ్యయనాలు జరిగాయి. అందులో కూడా పరిశోధకులు ఇలాంటి అభిప్రాయాన్ని చెప్పారు. టాటూల వల్ల చర్మంలోని చెమట గ్రంథులకు నష్టం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. చెమట గ్రంథులు శరీరాన్ని చల్లబరచడం కోసం చెమటను ఉత్పత్తి చేసి బయటకి పంపిస్తాయి. దీనివల్ల మన శరీరంలో తగినంత ఉష్ణోగ్రత మాత్రమే ఉంటుంది. అయితే టాటూలు వేయించుకున్న చోట చెమట గ్రంథులు సరిగా పనిచేయవు. పచ్చబొట్టు ఉన్న ప్రాంతంలో ఒకలా, పచ్చబొట్టు లేని ప్రాంతంలో ఒకలా చెమట గ్రంథులు పనిచేస్తాయి.





# ఏడ్చి ఏడ్చి విసిగిపోయా, ఇక నోరు మూసుకునేది లేదు

నటీనటుల క్యారెక్టర్‌ను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిపై యాంకర్, నటి విష్ణుప్రియ భీమనేని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై నిరంతరం తప్పుడు ప్రచారం చేస్తూ, అసభ్యకరంగా మాట్లాడుతున్న ప్లే లైక్ ఇంకాగ్నిటో' అనే యూట్యూబ్ ఛానల్‌పై ఆమె హైదరాబాద్‌లోని మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇప్పటికే ఎఫ్ఐఆర్ (FIR) నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారని ఆమె అన్నారు.విష్ణుప్రియ భీమనేని మాట్లాడుతూ "మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చాము, ఎఫ్ఐఆర్ నమోదైంది. యాక్షన్ తీసుకోబోతున్నారు. వి ఆర్ సో గ్రేట్‌ఫుల్!. 'ఇంకాగ్నిటో' అనే YouTube ఛానల్ ఉంది. తను ఒక అమ్మాయి అయ్యుండి, వేరే ప్రతి సెలబ్రిటీ అమ్మాయిల మీద ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతుంది. అందుకే నేను ఆమె మీద ఖచ్చితంగా చర్యలు తీసుకోవాలి అనుకున్నా, తనే కాదు, ఇంకా చాలా మంది ఉన్నారు. వాళ్ళందరికీ కూడా ఇది ఒక ఇన్ఫర్మేషన్‌గా చెప్తున్నాను; మీరు ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే మీ ఛానల్ మీద స్ట్రైక్ పడేటట్టు, మీ మీద ఖచ్చితంగా చర్యలు తీసుకునేటట్టు చేస్తాం. ఎప్పుడో యాక్షన్ తీసుకోవాలి, కానీ చాలా రోజులు వెయిట్ చేసి, చాలా నిందల తర్వాత, చాలా నెగిటివ్ బ్యాడ్ పబ్లిసిటీ, రాంగ్ పబ్లిసిటీ, రాంగ్ ఇన్ఫర్మేషన్ అది కరెక్ట్ ఇన్ఫర్మేషన్ లాగా రాంగ్ ఇన్ఫర్మేషన్ ఆడియన్స్‌కి ప్రాజెక్ట్ చేస్తున్నందుకు, కొన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్స్‌లో అలా రాంగ్‌గా చేస్తున్న వాళ్ళ మీద ఈ కంప్లైంట్. మేము ఈ ఎంటర్టైన్మెంట్ ఫీల్డ్‌కి వచ్చింది జనాల్ని ఎంటర్టైన్ చేయడానికి, ఆనందపరచడానికి. వాళ్ళు ఉన్న బాధల్లో ఒక ఫైవ్ మినిట్స్ గానీ, 10 మినిట్స్ గానీ మా కంటెంట్ చూసి వాళ్ళు ఎంజాయ్ చేయాలని. నిజంగా తప్పులైనప్పుడు నిందించండి, ఖండించండి; తలదించుకుని ఎన్నైనా మాటలు పడతాము. తప్పు కానివి క్యారెక్టర్ అస్సాసినేట్ చేస్తూ, "డబ్బుల కోసం శరీరం అమ్ముకుంటుంది" ఇలాంటి వర్డ్స్ .. అది కూడా కొంతమంది పెద్ద పెద్ద వాళ్ళు మాట్లాడుతున్నారు పెద్ద పెద్ద ఛానల్స్ లో! ఓకే ఫైన్. ఇంకా ఎన్ని రోజులు ఇలా నోరు మూసుకొని ఉంటాను? ఒక్కసారైనా నాకోసం నేను నించొని.. నాకోసమే కాదు, ఇంకా వేరే ఏ ఆడపిల్లల గురించి ఎలా పడితే అలా, ఎవరు పడితే ఎవరైనా మాట్లాడకూడదని ఈ డెసిషన్ తీసుకుంటున్నాను. ప్రస్తుతానికి అయితే ఒక్కరితో స్టార్ట్ చేశాము. ఇక ముందు ఎవరు ఇలా చేసినా మీ ఛానల్స్ మీద స్ట్రైక్స్ పడేలా, కఠిన చర్యలు తీసుకునేలా ముందుకు వెళ్తాం" అని విష్ణుప్రియ హెచ్చరించారు.



# మోసం చేస్తే వదిలేస్తా

టాలీవుడ్ ఒకప్పటి స్టార్ హీరోయిన్, పంజాబీ ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్ ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. ప్రముఖ నటుడు, నిర్మాత జాకీ భగ్నానీ (Jackky Bhagnani) ని వివాహం చేసుకుని హ్యాపీగా లైఫ్ లీడ్ చేస్తున్న రకుల్.. తాజాగా తన కొత్త సినిమా ప్రమోషన్స్ ఇంటర్వ్యూలో 'రిలేషన్‌షిప్స్ & మోసం' (Cheating) పై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా ఓ యూట్యూబ్ టాక్ షోలో ఆయుష్మాన్ ఖొరానా, సారా అలీఖాన్, రకుల్ ప్రీత్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంధాలు, మోసాల గురించి ఆసక్తికర చర్చ జరిగింది. ఇందులో ముందుగా రిలేషన్‌లో ఏదైనా పొరపాటు జరిగినప్పుడు నిజాయితీగా క్షమాపణ చెబితే క్షమించేయాలని, మనమంతా మనుషులమే కాబట్టి పొరపాట్లు సహజమని ఆయుష్మాన్ పేర్కొన్నారు. అలాగే ఒక్కసారి పొరపాటున మోసం చేస్తే క్షమించవచ్చా? అని సారా అడగ్గా.. రకుల్ తొలుత 'ఓకే' అంది. కానీ, వెంటనే స్పందిస్తూ.. 'ఒక్కసారి తప్పు చేస్తే క్షమించొచ్చు, కానీ దాన్నే అలవాటుగా (Habit) మార్చుకుని పదే పదే మోసం చేస్తూ ఉంటే మాత్రం నేను అస్సలు ఊరుకోను, సహించను' అని చాలా ఖచ్చితంగా తేల్చి చెప్పింది. తన వ్యాఖ్యలు పర్సనల్ లైఫ్‌కు ముడిపెట్టి వివాదంగా మారుతాయని గ్రహించిన రకుల్.. ఇంటర్వ్యూలోనే వెంటనే .. 'నేను చెప్పిన అభిప్రాయం కేవలం సాధారణమైనది మాత్రమే. ఇది నాకు, నా భర్త జాకీ భగ్నానీకి అస్సలు వర్తించదు. దయచేసి దీనిపై ఎలాంటి తప్పుడు వార్తలు, గాసిప్స్ సృష్టించొద్దు' అని క్లారిటీ ఇచ్చింది.




# తమిళ మాస్ డైరెక్టర్‌తో.. చైతూ కొత్త ప్రాజెక్ట్ ఫిక్స్..!



యువసామ్రాట్ నాగచైతన్య (Naga Chaitanya) ప్రస్తుతం తన కెరీర్‌లోనే బెస్ట్ ఫేజ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. చందూ మొండేటి దర్శకత్వంలో వచ్చిన 'తండేల్' (Thandel) చిత్రంతో తన కెరీర్‌లోనే మొదటిసారి రూ. 100 కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టి సాలిడ్ కంబ్యాక్ ఇచ్చారు. ప్రస్తుతం కార్తీక్ దండు దర్శకత్వంలో 'వృషకర్మ' (Vrushakarma) అనే మైథలాజికల్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో నటిస్తూ బిజీగా ఉన్న చై.. తన తదుపరి చిత్రం కోసం ఒక సీనియర్ తమిళ దర్శకుడితో చర్చలు జరుపుతున్నట్లు ఫిలింనగర్ వర్గాల్లో ఒక ఆసక్తికరమైన వార్త హల్‌చల్ చేస్తోంది.

గతంలో 'పందెం కోడి', 'ఆవారా' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన కోలీవుడ్ మాస్ డైరెక్టర్ లింగుస్వామి (Lingusamy) దర్శకత్వంలో నాగచైతన్య తన నెక్ట్స్ ప్రాజెక్ట్‌ను ప్లాన్ చేస్తున్నట్లు గట్టిగా టాక్ వినిపిస్తోంది. అయితే, ఈ కాంబినేషన్ వార్త అక్కినేని అభిమానుల్లో తీవ్ర చర్చకు, కొంత ఆందోళనకు దారితీసింది. ఎందుకంటే ఒకప్పుడు బ్లాక్‌బస్టర్ హిట్స్ ఇచ్చిన లింగుస్వామి ట్రాక్ రికార్డ్ ఇటీవల ఆశించిన స్థాయిలో లేదు. రామ్ పోతినేనితో ఆయన తెలుగు, తమిళ భాషల్లో భారీ అంచనాలతో తెరకెక్కించిన 'ది వారియర్' (The Warriorr) చిత్రం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. గతంలో నాగచైతన్య మరో తమిళ స్టార్ డైరెక్టర్ వెంకట్ ప్రభు నమ్మి చేసిన 'కస్టడీ' (Custody) సినిమా కూడా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది.

దీంతో మళ్లీ ఫామ్‌లో లేని తమిళ దర్శకుడితో రిస్క్ చేయడం అవసరమా? 'తండేల్' తెచ్చిన వంద కోట్ల మార్కెట్‌ను చైతన్య కాపాడుకోవాలి కదా? అంటూ కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనప్పటికీ, ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వార్తలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మరి ఈ క్రేజీ కాంబినేషన్ కేవలం రూమర్‌గానే మిగిలిపోతుందా లేక నిజంగానే నాగచైతన్య, లింగుస్వామికి లైన్ ఇస్తారా అనేది తెలియాలంటే కొద్దిరోజులు ఆగాల్సిందే!




# పెద్ది'పై హై ప్రెజర్ ?


విడుదలకు ముందే ఇప్పుడు భారీ హైప్ క్రియేట్ చేస్తున్న సినిమా 'పెద్ది'. కానీ, ఈ హైప్ మొత్తం నిజంగానే కథ, మేకింగ్ వల్ల వచ్చిందా? లేక రామ్ చరణ్ చేసిన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వల్ల పెరిగిందా? నిజమైన పెహల్వాన్ల తో షూటింగ్ చేయడం వెనుక అసలు కారణం ఏంటి? షూటింగ్ సమయంలో ఆర్టిస్టుల నుంచి నాచురల్ ఎమోషన్స్ రావడానికి దర్శకుడు బుచ్చిబాబు ఎలాంటి పద్ధతులు ఫాలో అయ్యాడో ఇప్పుడు చూద్దాం. 'పెద్ది' రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న కొద్దీ ఆ సినిమాపై హైప్ కూడా భారీగానే పెరుగుతోంది. ప్రమోషన్స్ బాధ్యత చరణ్, బుచ్చిబాబు ఇద్దరే తీసుకున్నారా అనే టాక్ కూడా ఒకవైపు వినిపిస్తోంది. అందులో భాగంగానే 'A Driving Through Peddi Memories' వీడియో రిలీజ్ అయింది.

'పెద్ది' కథ మొదట వినగానే రామ్ చరణ్ ఆసక్తి చూపాడని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. కారణం.. ఇది కేవలం స్పోర్ట్స్ డ్రామా కాకుండా, గ్రామీణ బ్యాక్ డ్రాప్‌లో సాగే రా అండ్ ఎమోషనల్ కథ కావడమే! ఇంకా స్క్రిప్ట్ బాగా కుదిరిందని, ఆ స్క్రిప్ట్ కి పడిపోయాడట చరణ్. దేశీ పెహల్వాన్ పాత్ర కోసం చరణ్ దాదాపు ఏడాదికి పైగా ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. షూటింగ్ లో నిజమైన పెహల్వాన్లను ఉపయోగించడం కూడా ఇప్పుడు చర్చగా మారింది. ఫైట్ సీన్స్ ఎక్కువగా నాచురల్ గా కనిపించేందుకు రియల్ రెజ్లర్లతోనే రిహర్సల్స్ చేశారట. అయితే, ఆ ఫైట్స్ లోనే చరణ్ చేతికి గాయమైంది. అయినా షూటింగ్ ఎక్కడా ఆగలేదు. ఇలాంటి రియలిస్టిక్ అప్రోచ్ సినిమాకు ప్లస్ అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, అది ఆడియన్స్‌కు ఎంతవరకు కనెక్ట్ అవుతుందో రిలీజ్ తర్వాతే క్లారిటీ వస్తుంది.



# ఎప్పుడూ అదే పక్షపాత ధోరణి

కథానాయకులు ప్రధాన పాత్రలు పోషించే చిత్రాలకు లభించే బడ్జెట్‌లు, మద్దతు లాంటివి నాయికా ప్రాధాన్య ప్రాజెక్టులకు దొరకవంటోంది బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషీ. ఇటీవలే కేన్స్ చిత్రోత్సవంలో పాల్గొన్నారీమె. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో చిత్రపరిశ్రమ గురించి మాట్లాడారు. "మనది చాలా వైవిధ్యమైన దేశం. మనదైన శైలిలో మహిళా ప్రాధాన్య కథలను రూపొందించడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. ఎలాంటి రీమేక్‌లు చేయకుండా.. ఒరిజినల్ కంటెంట్‌ను రూపొందించాలి. మన పురాణాలు, సంస్కృతులపై కూడా దృష్టిపెడతారని ఆశిస్తున్నా. హీరోలకు లభించే బడ్జెట్‌లు మాకు లభించవు. మహిళా చిత్రాలకు బాక్సాఫీస్ వద్ద ఒక నిర్దిష్ట సామర్థ్యం మాత్రమే ఉంటుందనే పక్షపాత ధోరణి ఇండస్ట్రీలో ఎప్పుడూ ఉంటుంది. ఈ రోజుల్లో కూడా అలా ఉంటుందా అంటే బహుశా దాని గురించి ఎవరూ అంతగా మాట్లాడకపోయి ఉండొచ్చు. అంతేకానీ, లేదని మాత్రం కాదు. ప్రస్తుతం నేను కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాను. ఇది నిరంతరం ఎదుర్కోవాల్సినదే. దానిని అధిగమించడానికి ఏకైక మార్గం ముందుకు సాగిపోతూ పని చేస్తూ ఉండడమే. నేను మాత్రమే కాదు నా తోటి నటీమణులు చాలా మంది.. తమ కెరీర్‌లో తమ కోసమే కాకుండా భవిష్యత్తులో తమ తర్వాత వచ్చే అనేక మంది కోసం వాస్తవ పరిస్థితిని మార్చడానికి నిరంతరం కృషి చేస్తూ ఆ పరిమితులను దాటుతున్నారనే భావిస్తున్నాన"ని అన్నారు. హ్యూమా ప్రస్తుతం యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'టాక్సిక్' చిత్రంలో నటిస్తోంది.



# ట్రోల్స్‌ను ట్రెండ్‌గా మార్చిన సాయి అభ్యంకర్..

మ్యూజికల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న కుటుంబం నుండి వచ్చినప్పటికీ.. ఎలాంటి సిఫార్సులు లేకుండా కేవలం తన సొంత టాలెంట్‌తో, ఇండిపెండెంట్ ఆడియో సింగిల్స్‌తో ఇండస్ట్రీలో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ (Sai Abhyankar). మమితా బైజు నటించిన 'డ్యూడ్' (Dude) సినిమాతో సౌత్ ఇండస్ట్రీలో బిగ్గెస్ట్ మ్యూజికల్ బ్రేక్ అందుకున్న ఈ యంగ్ కంపోజర్ ఆల్బమ్స్ ఇప్పటికీ ఇంటర్నెట్‌ను ఊపేస్తున్నాయి.

తాజాగా కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటించిన 'కరుప్పు' (Karuppu) సినిమాతో సాయి అభ్యంకర్ మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతున్న సూర్య 'కరుప్పు' చిత్రానికి సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందించారు. అయితే, సినిమా రిలీజ్‌కు ముందు, రిలీజ్ అయిన కొత్తలో ఈ చిత్రం ఆల్బమ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (BGM) పై తీవ్రమైన నెగిటివిటీ, విమర్శలు వచ్చాయి. కానీ, ఇప్పుడు సీన్ పూర్తిగా రివర్స్ అయింది. సాయి అభ్యంకర్ అందించిన ట్రాక్స్ సోషల్ మీడియాలో సరికొత్త ట్రెండ్ సెట్ చేస్తున్నాయి. ఇప్పుడు అదే ట్రాక్స్ రీల్స్, షార్ట్స్‌లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఇందులోని 'ఊరుమ్ బ్లడ్' (Oorum blood) ట్రాక్ ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌ను రూల్ చేస్తోంది.

'డ్యూడ్' సినిమా విషయంలో కూడా మొదట్లో ఇలాగే జరిగి, ఆ తర్వాత చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు 'కరుప్పు' విషయంలోనూ సాయి అభ్యంకర్ 'స్లో పాయిజన్' ఫార్ములా వర్కవుట్ అయ్యిందని అందరూ ప్రశంసలు కురిపిస్తున్నారు.ఇక సాయి అభ్యంకర్ చేతిలో ప్రస్తుతం టాలీవుడ్ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ ఉంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ (Allu Arjun) నటిస్తున్న తదుపరి భారీ పాన్‌ఇండియా చిత్రం 'రాకా' (Raaka) ఉంది. ఇదే మొమెంట్ కంటిన్యూ అయితే రాబోయే రోజుల్లో సౌత్ ఇండియాలోనే టాప్ లీగ్ మ్యూజిక్ డైరెక్టర్ల జాబితాలో సాయి అభ్యంకర్ చేరడం ఖాయం.

# జైలర్ 2 రిలీజ్ డేట్‌లో మార్పు.. ఎప్పటికీ వాయిదా పడిందంటే?

సూపర్ స్టార్ రజినీకాంత్, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ కలయికలో వస్తున్న చిత్రం 'జైలర్ 2'. సూపర్ హిట్ సక్సెస్ అందుకున్న 'జైలర్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రంపై అనౌన్స్‌మెంట్ నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. దీంతో సినిమా రిలీజ్ కోసం ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకులు ఈగర్‌గా వెయిట్ చేస్తూనే ఉన్నారు. అయితే.. ఎదురు చూస్తున్న కొద్దీ ఈ చిత్రం వాయిదాలు పడుతూనే ఉంది. మొదట జైలర్ 2ను జూన్‌లో రిలీజ్ చేద్దాం అనుకోగా కొన్ని కారణాల చేత వాయిదా పడింది. మళ్లీ ఆగస్టు 15కు విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. అయితే.. ఆగస్టు 15 వీకెండ్‌లో భారీ క్లాష్ ఉండటంతో ఇప్పుడు మేకర్స్ గణేశ్ చతుర్థి హాలిడే సీజన్‌ను టార్గెట్ చేసినట్లు సమాచారం. ఈ మేరకు జైలర్ 2 ను సెప్టెంబర్ 11, 2026న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారట మేకర్స్. అలాగే సరైన టాక్ వస్తే జైలర్ 2 తమిళ ఇండస్ట్రీ నుంచి తొలి ₹1000 కోట్ల చిత్రంగా నిలిచే అవకాశముందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.